సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

రాయికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చింతలూరు గ్రామ ప్రజలు, కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. గిరిజన తండాకు కిలో మీటర్ మేరకు రోడ్డు నిర్మాణానికి రూ.68 లక్షల నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్ రెడ్డి, అందుకు కృషి చేసిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌లకు వారు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు అల్లాల అంజిత్, మాజీ సర్పంచ్ మోహన్‌రావు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రమేష్ నాయక్, రాజేందర్, గంగాధర్, బలరాం పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలు

జగిత్యాల క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని ఎస్‌కే ఎన్‌ఆర్ డిగ్రీ కళాశాల మైదనాంలో శుక్రవారం జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించారు. అండర్ 14, 17 విభాగాల్లో రన్నింగ్, లాంగ్ జంప్, షాట్ పుట్ తదితర పోటీలను నిర్వహించినట్లు డీఈవో జగన్‌మోహన్ రెడ్డి పేర్కొన్నారు. విజేతలకు ఎస్‌కేఎన్‌ఆర్ ప్రిన్సిపాల్ అశోక్ చేతుల మీదుగా మెడల్స్ అంద జేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీరామ్ నాయక్, పేటా అధ్యక్ష, కార్యదర్శులు విశ్వప్రసాద్, అశోక్, పీడీలు కృష్ణ ప్రసాద్, అంజయ్య ఉన్నారు.

జిల్లా స్థాయి కరాటే పోటీలు

జగిత్యాల క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలో శుక్రవారం జిల్లా స్థాయి కరాటే ఎంపిక పోటీలను నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన 300 మంది బాల, బాలికలు అండర్ 14, 17 విభాగాల్లో పోటీపడి తమ ప్రతిభను చాటారు. ఉత్తమ ప్రతిభ చాటిన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొననున్నట్లు జిల్లా క్రీడల కార్యదర్శి లక్ష్మీ రామ్‌నాయక్ పేర్కొన్నారు. పీడీలు శ్రీనివాస్, కోటేశ్వర్‌రావు, దయాకర్, విజయ, యమున, శ్రీను, పవన్, రమేష్ ఉన్నారు.

కేంద్ర సహాయ మంత్రిని కలిసిన బీజేపీ శ్రేణులు


బండి సంజయ్‌ను కలిసిన బీజేపీ నాయకులు

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్‌ను శుక్రవారం కోరుట్ల బీజేపీ శ్రేణులు కలిసారు. కరీంనగర్‌లోని బండి సంజయ్ ఇంట్లో బీజేపీ రాష్ట్ర నాయకుడు సురభి నవీన్‌రావు, బీజేవైఎం నియోజకవర్గ నాయకుడు సడిగే మహేష్‌లు మర్యాద పూర్వకంగా కలిసి స్థానికంగా ఉన్న పార్టీ పరిస్థితిపై వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పర్యాటక అభివృద్ధిపై దృష్టి



- విద్యార్థులు, యువతే ప్రచార తారలుగా యువ క్లబ్‌ల ఏర్పాటు
- ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 300కు పైగా వైటీసీలు
- రాష్ట్ర స్థాయిలో పర్యాటకంపై జగిత్యాలకు తృతీయ బహుమతి
- మంత్రి చేతుల మీదుగా అవార్డు అందుకున్న కలెక్టర్

జగిత్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో యువ క్లబ్‌ల ఏర్పాటుతో పర్యాటక అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం దృష్టి సారించింది. ఇందులో భాగంగా జిల్లా వ్యాప్తంగా గల పలు ఉన్నత పాఠశాలలు, కళాశాలల్లో విద్యార్థులతో యువ టూరిజం క్లబ్‌ను ముమ్మరంగా ఏర్పాటు చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతీయేటా ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న పోటీల్లో ప్రస్తుత యేడాది జగిత్యాల జిల్లాకు రాష్ట్ర స్థాయిలో తృతీయ బహుమతి దక్కింది. ఇటీవల హైద్రాబాద్‌లోని గచ్చిబౌళిలో రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో వరల్డ్ టూరిజం సెలబ్రేషన్లలో భాగంగా మంత్రి జూపల్లి కృష్ణారావు చేతుల మీదుగా కలెక్టర్ సత్య ప్రసాద్ బహుమతితో పాటు రూ. లక్ష నగదును అందుకున్నారు.

యువతను కొత్త ఆలోచనల వైపు నడిపించేలా...

రాష్ట్ర పర్యాటకశాఖ సమన్వయంతో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న యువ టూరిజం క్లబ్‌లు (వైటీసీ) స్థానిక విద్యార్థులు, యువతను కొత్త ఆలోచనల వైపు నడిపించనున్నాయి. ఇప్పటికే జిల్లాలో సుమారు 320 వైటీసీలను ఏర్పాటు చేశారు. వీటిలో సుమారు 8,000 మంది విద్యార్థులు, యువకులు భాగస్వామ్యం కానున్నారు.

ఒక్కో క్లబ్‌లో పాతిక మంది....

యువ టూరిజం క్లబ్‌ల ఏర్పాటు ద్వారా స్థానిక విద్యార్థులు, యువతకు పర్యాటక ప్రాముఖ్యతలపై పూర్తి స్థాయి అవగాహన కల్పించనున్నారు. మొదటి దశలో క్లబ్‌ల ఏర్పాటు, రెండో దశలో పర్యాటకంలపై వివిధ దశల్లో పోటీలు నిర్వహించనున్నారు. మూడో దశలో ఈ క్లబ్‌లు క్షేత్రస్థాయికి వెళ్లి సంస్కృతి, సాంప్రదాయాలకు పర్యాటక రంగాలు ఎలా ఉపయోగప డతాయి.. వీటి పరిరక్షణ ఎలా చేయాలి... వంటి వాటిపై దృష్టి పెడతారు. పాఠశాలలు, కళా శాలలు, విశ్వవిద్యాలయాల స్థాయిలో ఒక్కో క్లబ్‌ను 25 మందితో ఏర్పాటు చేస్తున్నారు. ప్రతి క్లబ్‌కు అందులోని విద్యార్థియే టీం లీడర్‌గా, ఆ విద్యాలయంలో పని చేసే ఉపాధ్యాయుడు కో ఆర్డినేటర్‌గా వ్యవహరించనున్నారు. క్లబ్‌ల ఏర్పాటుతో జిల్లా పర్యాటకానికి మరింత గుర్తింపు రావడంతో పాటు విద్యార్థులు, యువతకు వారసత్వ సంపదపై అవగాహన కలిగించేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు.

పర్యాటక కేంద్రం దిశగా ఖిల్లా...

జగిత్యాలకు పేరుతెచ్చిన ఖిల్లాకు కొన్నేళ్ల చరిత్ర ఉంది. చరిత్రకు సజీవ సాక్ష్యంగా నిలిచిన గుర్తులు ఇంకా ఖిల్లాలో ఉన్నాయి. పర్యాటక శాఖ ఆదరిస్తే ఇదోక పర్యాటక కేంద్రంగా తీర్చి దిద్దవచ్చని అధికారులు భావిస్తున్నారు. శత్రు దుర్భేద్యంగా నిర్మించిన ఈ ఖిల్లాలో ఫిరంగులు, లోగైన కందకాలు, సైనికులు ఉండేందుకు ప్రత్యేక గదులు, ఆయుధాలు నిల్వ చేసుకునేం దుకు ఒక చీకటి గది, సైనికుల, తాగునీటి కోసం నిర్మించిన బావి, సొరంగం ఉన్నాయి.

మిగతా 8వ పేజీలో

విద్యాశాఖ అధికారులపై ఆర్‌జేడీకి ఫిర్యాదు


ఆర్‌జేడీకి ఫిర్యాదు చేస్తున్న ఉపాధ్యాయ సంఘ సభ్యులు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన ఇద్దరు మండల విద్యాధికారులు, డీసీఈబీ సెక్రటరీ జిల్లా సైన్స్ అధికారులపై జిల్లా యూపీఎస్‌పీసీ కమిటీ పాఠశాల ఆర్‌జేడీ వరగల్‌కు ఫిర్యాదు చేశారు. జిల్లాలో ఈ మధ్య జరిగిన పీఆర్‌టీయూ సర్వసభ్య సమావేశంలో జగిత్యాల రూరల్, గొల్లపల్లి మండల విద్యాధికారులు జిల్లా డీసీఈబీ సెక్రటరీ, జిల్లా సైన్స్ అధికారి బ్యాడ్జీలు, సంఘం కండువాలు ధరించి పాల్గొనడం నిబంధనలకు వ్యతిరేకమని, అలాగే స్కూల్ కాంప్లెక్స్ ఉపాధ్యాయుల సమావేశంలో ఇటీవల పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన వ్యక్తికి డీసీఈబీ సెక్రటరీ మనోహరా చారి ప్రభుత్వ శిక్షణ కార్యక్రమంలో సన్మానం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా టీఎస్ యూటీఎఫ్ అధ్యక్షుడు తిరుకోవెల శ్యాంసుందర్, డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎన్నం రాంరెడ్డి, దూమాల శంకర్, కొక్కుల రాంచంద్రం, అంబటి భూమేశ్వర్ పాల్గొన్నారు.

11రోజులు అమరవీరుల సంస్మరణ కార్యక్రమాలు

ఎస్పీ అశోక్ కుమార్

జగిత్యాల క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) :పోలీస్ అమర వీరుల ప్రాణ త్యాగాల సంస్మరణలో భాగంగా ఈ నెల 21 నుంచి 31 వరకు గల 11 రోజులు వివిధ కార్యక్ర మాలు చేపడుతున్నట్లు ఎస్పీ అశోక్ కుమార్ పేర్కొన్నారు. పోలీస్ అధికారులతో శుక్రవారం ఎస్పీ సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఆన్‌లైన్‌లో విడియో కాన్ఫరెన్స్ ద్వారా విద్యార్థులకు పోలీసులు వినియోగించే వివిధ ఆయుధాలు, పోలీసుల విధులు, బాధ్యతలు తదితర అంశాలపై అవగాహన కల్పిస్తామన్నారు. తెలుగు, ఇంగ్లీష్, ఉర్దూ బాషల్లో వ్యాసరచన పోటీతో పాటు షార్ట్ ఫిలిమ్స్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. రక్తదాన శిబిరాలతో పాటు సైకిల్ ర్యాలీలు చేపట్టనున్నట్లు వివ రించారు. రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో పోలీస్ కళాజాత బృం దం సభ్యులచే పలు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వివరించారు.

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

పెగడపల్లి, అక్టోబరు (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుద్దపల్లిలో శుక్రవారం పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా నిర్వహించారు. సుద్దపల్లి, ఆరవెల్లి గ్రామాల విశ్వ బ్రాహ్మణుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శుక్రవారం పూజాకార్యక్రమాలు నిర్వహించి ప్రతిష్ఠాపనోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమాలలో రెండు గ్రామాల, ఉత్సవ కమిటీ నాయకులు నరేందరాచారి, రవిచారి, వైకుంఠం చారి, గంగేశ్వర చారి, శ్రీధర్ చారి, రెండు గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్స్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలి

వీసీలో టీఎస్‌పీఎస్‌సీ చైర్మన్ మహేందర్‌రెడ్డి


వీడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతరులు

జగిత్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రూప్స్ పరీక్షలను సజావుగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు పటిష్టం చేస్తూ సన్నద్ధం కావాలని తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ చైర్మన్ మహేందర్ రెడ్డి సూచించారు. శుక్రవారం హైద్రాబాద్ నుంచి జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్, ఇతర అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. గ్రూప్-2, గ్రూప్-3 పరీక్షల నిర్వహణ కోసం జిల్లాలో ఏర్పాట్లు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా కలెక్టర్ సత్య ప్రసాద్ మాట్లాడుతూ జిల్లాలో అన్ని విభాగాలకు చెందిన అధికారులను సమన్వయం చేసుకుంటున్నారన్నారు. జిల్లాలో వచ్చే నెలలో సుమారు 34 కేంద్రాలను గ్రూప్ పరీక్షల కొరకు గుర్తించడం జరిగిందన్నారు. జిల్లా నుంచి సుమారు 11 వేల మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీ) గౌతమ్ రెడ్డి, ఆర్‌డీవో మధుసూదన్, ఏఎస్‌పీ భీమ్ రావు, కలెక్టరేట్ కార్యాలయ ఏఓ హన్మంత్ రావు పాల్గొన్నారు.

గ్రామాల్లో జాతీయ బృందం పర్యటన

- బతుకమ్మతో స్వాగతం పలికిన మహిళలు
- కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై పరిశీలన

8


గ్రామంలో పర్యటిస్తున్న జాతీయ బృందం

యువకులు క్రీడల్లో రాణించాలి

వాలీబాల్ టోర్నమెంట్‌లో మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు

8


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డీఎస్పీ

పురుగుల మందు డబ్బాలతో ఆందోళన

తన పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేస్తున్నారని రైతు ఆరోపణ

6

తహసీల్దార్ కార్యాలయం ఎదుట బైఠాయించిన రైతు నరేష్



కొడుకు పట్టించుకోవడం లేదని..

ఆర్డీవోను ఆశ్రయించిన వృద్ధురాలు కేసు నమోదు

జగిత్యాల అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వృద్ధురాలినని చూడకుండా కన్న కొడుకు, కోడలు ఇంటి నుంచి వెళ్లిపొమ్మంటున్నారని, తనకు తిండి కూడా పెట్టకుండా వైద్యానికి డబ్బులు ఇవ్వడం లేదంటూ పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామానికి చెందిన గాజుల శంకరవ్వ (76) అనే వృద్ధురాలు జగిత్యాల ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఫిర్యాదు చేసింది. తన భర్త పేరుపై ఉన్న ఇంట్లో ఉంటూ తన భర్త పేరుపై ఉన్న 28 గుంటల భూమిని తనకు తెలియకుండా అక్రమంగా పట్టా చేసుకున్నాడని ఆర్డీవోకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దీంతో వృద్ధురాలి కుమారుడిపై వయోవృద్ధుల రక్షణ చట్టం సెక్షన్ 2 (బి), సెక్షన్ 4 (1), సెక్షన్ 24ల కింద కేసు నమోదు చేసినట్లు ఆర్డీవో కార్యాలయ పరిపాలన అధికారి తఫజుల్ హుస్సేన్ తెలిపారు. వృద్ధురాలి వెంట సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

జగిత్యాల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తా..

ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్


లబ్ధిదారులకు చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల నియోజకవర్గం అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తానని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని 22 మంది లబ్ధిదారులకు రూ.6 లక్షల 35 వేలు విలువ చేసే సీఎం సహాయ నిధి చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి అభివృద్ధి, సంక్షేమం ధ్యేయంగా పని చేస్తున్నారని, నూకపల్లి డబుల్ బెడ్ రూం ఇళ్ల మౌలిక సదుపాయాల కోసం రూ.14 కోట్లతో పనులు ప్రారంభమయ్యాయని, రూ.15 కోట్ల సీఆర్ఆర్ నిధులు ముఖ్యమంత్రి మంజూరు చేశారన్నారు. పట్టణంలో టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.4 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించామని, అలాగే నియోజకవర్గానికి రూ.75 కోట్ల ఆర్ అండ్ బీ నిధుల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అడువాల జ్యోతి, వైస్ చైర్మన్ గోలి శ్రీనివాస్, అడువాల లక్ష్మణ్, ముప్పాల రాంచంద్రారావు, గిరి నాగభూషణం, బాలముకుందం, నారపాక రమేష్ పాల్గొన్నారు.

ధర్మ సమాజ మహా సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరణ

జగిత్యాల అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నవంబరు 3న హైదరాబాద్‌లో జరుగబోయే ధర్మ సమాజ్ పార్టీ కార్యకర్తల మహా సమ్మేళనం పోస్టర్‌ను శుక్రవారం ఆవిష్కరించారు. జిల్లా కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధర్మ సమాజ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడ్డం హరీష్ గౌడ్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రీజనల్ ఇన్‌ఛార్జి చిలువేరు శ్రీకాంత్, జగిత్యాల జిల్లా నాయకులు ఉపేంద్ర మహారాజ్, కోటేష్ మహారాజ్, గంగరాజ మహారాజ్ తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ ప్లాట్లను క్రమబద్ధీకరించాలి

కలెక్టర్ సత్య ప్రసాద్


ఎల్ఆర్ఎస్ స్థలాలను పరిశీలిస్తున్న కలెక్టర్ సత్య ప్రసాద్

జగిత్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ పరంగా ఎలాంటి ఇబ్బందుల్లేని ఎల్ఆర్ఎస్ ప్లాట్లను క్రమబద్ధీకరించాలని సంబంధిత అధికారులను జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ ఆదేశించారు. శుక్రవారం పట్టణంలోని తులసినగర్‌లో జరుగుతున్న ఎల్ఆర్ఎస్ ప్లాట్ల క్రమబద్ధీకరణ సరళిని పలువురు అధికారులతో కలిసి పరిశీలించారు. ఎల్ఆర్ఎస్ రికార్డులను, వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. శిఖం భూముల్లో లేని ప్లాట్లను, రెవెన్యూ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేని ప్లాట్లను క్రమబద్ధీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఆర్‌డీవో మధుసూదన్, మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ చిరంజీవి, పలువురు మున్సిపల్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

భూముల సర్వే పకడ్బందీగా నిర్వహించాలి

రాయికల్, అక్టోబరు 28 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల సర్వేను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సత్యప్ర సాద్ అన్నారు. రాయికల్ మండలంలోని ప్రభుత్వ భూములను శుక్రవా రం జగిత్యాల ఆర్డీవో మధుసూదన్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో చేపట్టిన ప్రభుత్వ భూముల సర్వే ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని అన్నారు. కలెక్టర్ వెంట రాయికల్ మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్‌గౌడ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఓటరు నమోదు

రాయికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ మండలంలోని 12 ఉన్నత పాఠశాలలతో పాటు మోడల్ స్కూల్, కస్తూర్బా గాంధీ, గురుకుల పాఠశాలల్లో ఉపాధ్యా య ఎమ్మెల్సీ ఓటరు నమోదు పత్రాలను పీఆర్‌టీయూ టీఎస్ ప్రతినిధులు అందజేశారు.
రెండు రోజుల్లో మండలంలోని ఉపాధ్యాయులకు అందజేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షుడు అంతడుపుల గంగరాజం, ప్రధాన కార్యదర్శి రాపర్తి నర్సయ్య, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు పొన్నం రమేష్, రాష్ట్ర కార్యదర్శులు గాజెంగి రాజేశం, తాటిపెల్లి వేణుగోపాల్, లక్కడి రాజరెడ్డి, రాజమహ్మద్, జిల్లా ఉపాధ్యక్షుడు గుర్రం శ్రీనివాస్, మండల కార్యదర్శి చెట్‌పెల్లి బాపుఆరవు, ఊషకోల రాము తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు రూ.15 కోట్ల నిధులు మంజూరు

ధర్మపురి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ధర్మపురి నియోజకవర్గానికి పంచాయితీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ద్వారా రూ 15 కోట్లు సీఆర్‌ఆర్ నిధులు మంజూరు అయ్యాయని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. హైదరాబాద్ నుండి ఆయన ఫోన్ ద్వారా మాట్లాడుతూ రోడ్ల నిర్మాణం కోసం మంజూరు చేసిన నిధులు వివరాలు వెల్లడించారు. నియోజకవర్గ పరిధిలో గల ధర్మారం మండలంలోని బొమ్మారెడ్డిపల్లె హనుమాన్ టెంపుల్ నుంచి కొత్తపల్లి జీపీ ఆఫీస్ వరకు రోడ్డు నిర్మాణం కోసం 1.30 కోట్లు, ధర్మారం మండలంలోని ఖిలావనపర్తి పోచమ్మ ఒర్రె నిర్మాణం కోసం రూ 1.20 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. ఎండపల్లి మండలంలోని సూరారాం నుంచి గోపాల్‌రావుపేట రోడ్డు నిర్మాణం కోసం రూ 2 కోట్లు నిధులు, సూరారం బ్రిడ్జి వర్క్ కోసం రూ 30 లక్షలు నిధులు మంజూరు అయ్యాయని ఆయన పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని ఏడుమోటలపల్లె లింబాద్రితండా ఎక్స్ రోడ్డు నుంచి పెగడపల్లి వరకు రూ 2 కోట్లు, కీచులాటపల్లి నక్కపెల్లి నుంచి మల్లాపూర్ వరకు రోడ్డు నిర్మాణం కోసం రూ 8.20 కోట్లు నిధులు మంజూరు అయ్యాయని ఆయన వివరించారు. ఈ రోడ్ల దుస్థితి గురించి సంబంధిత మంత్రి దృష్టికి తీసుక వెళ్లగా వెంటనే నిధులు మంజూరు చేసినట్లు ఆయన తెలిపారు.
ఈ నిధులు మంజూరు కోసం సహకరించిన సీఎం రేవంత్‌రెడ్డి, సంబంధిత శాఖ మంత్రికి ప్రత్యేక కృతజ్ఞతలు ఆయన తెలిపారు.

కుంకుమ పూజలు


కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

జగిత్యాల క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని అరవింద్ నగర్‌లో ఉన్న శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం భక్తుల ఆధ్వర్యంలో కుంకుమ పూజలు నిర్వహించారు. అంతకు ముందు మహిళలు స్వామి వారలకు అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కొత్త మోహన్ ఉన్నారు.

క్రైం కార్నర్

కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కేసు

- శునకం కళేబరానికి పోస్టుమార్టం

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18: కరీంనగర్ జిల్లా కేంద్రంలోని కూరగాయల మార్కెట్‌లో తిరుగుతున్న ఒక కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కరీంనగర్ ఒకటో టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు, స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్త తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ కూరగాయల మార్కెట్ ప్రాంతంలో గురువారం ఒక కుక్కను అజీజ్ అనే వ్యక్తి ఇనుపరాడ్‌తో కొట్టి చంపాడు. కుక్క కళేబరాన్ని అక్కడే ఉన్న డస్ట్‌బిన్‌లో పడేశాడు. ఈ ఘటనను స్థానికంగా ఉన్న ఒక జంతు సంరక్షణ కార్యకర్త తన ఫోన్‌లో రికార్డు చేశారు. అనంతరం ఈ విషయాన్ని స్ట్రే యానిమల్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా కార్యకర్త ఎదులాపురం గౌతమ్‌కు తెలియజేశారు. వెంటనే ఆ కార్యకర్త సంఘటనాస్థలానికి చేరుకుని కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై కరీంనగర్ ఒకటో టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. దీనిపై జంతు సంక్షేమ ఉద్యమ నాయకురాలు మేనకాగాంధీ పోలీసులకు ఫోన్ చేసినట్లు సమాచారం. ఈ మేరకు కుక్కను కొట్టిచంపిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అనంతరం కరీంనగర్ వెటర్నరీ హాస్పిటల్‌లో కుక్క కళేబరానికి పోస్టుమార్టం కూడా నిర్వహించారు. ఈ కేసులో నిందితుడికి పోలీసులు నోటీసులు ఇచ్చి పంపించారు. ఆ కుక్క తనను కరవడంతోనే ఆగ్రహంగా అజీజ్ కొట్టిచంపాడని చెబుతున్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి


రమ్యకృష్ణ (ఫైల్)

పెగడపల్లి/రామడుగు, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెగడపల్లి మండల కేంద్రానికి చెందిన అలువాల రమ్యకృష్ణ (30) చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున హైదరాబాద్‌లోని ఆసుపత్రిలో మృతి చెందింది. కుటుంబ సభ్యులు బంధువులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 13న రాత్రి రామడుగు మండలం గోపాల్‌రావుపేట నుంచి పెగడపల్లికి అలువాల విష్ణు, రమ్యకృష్ణలు ఇరువురు ద్విచక్ర వాహనంపై వస్తున్నారు. మ్యాక వెంకయ్యపెల్లి గ్రామ శివారులో ఎదురుగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్ర వాహనంతో ఢీకొట్టగా కిందపడి గాయాలపాయ్యారు. రమ్య కృష్ణను చికిత్స నిమిత్తం కరీంనగర్‌కు అక్కడి నుంచి హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనుమానాస్పద స్థితిలో యువకుడి మృతి


లక్ష్మణ్‌గౌడ్(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని కొత్త బస్టాండ్ ప్రాంతంలో గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన భాగన్నగారి లక్ష్మణ్ గౌడ్ (38) శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. గంభీరావుపేటకు చెందిన లక్ష్మణ్‌గౌడ్ ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని ఓ వైన్స్ దుకాణం అనుబంధమైన పర్మిట్ రూంలో కొంత కాలంగా వంట మనిషిగా పని చేస్తుండేవాడు. ఉదయం వచ్చి రాత్రి పూట వెళ్లేవాడు. గురువారం రాత్రి పర్మిట్ రూం మూసిన తర్వాత గంభీరావుపేటకు వెళ్లేందుకు స్థానిక కొత్త బస్టాండుకు చేరుకున్నాడు. ఓ టేలా వెనుక పడిపోయి కనిపించడంతో స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. అక్కడకు చేరుకున్న పోలీసులు పరిశీలించగా అప్పటికే మృతి చెందాడని గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సుల్తానాబాద్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): సుల్తానాబాద్ మండలంలోని కొదురుపాక గ్రామంలో ఓ యువకుడు ఆత్మహత్యకు యత్నించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందారు. కొదురుపాక గ్రామానికి చెందిన దుగ్యాల జితేందర్‌రావు(22) అనే యువకుడు ఇటీవల ఖాళీగా తిరుగుతుండడంతో తల్లి ఏదైనా పని చేసుకోవాలని మందలించింది. దీంతో మనస్థాపం చెందిన యువకుడు ఈనెల 15న ఊరు బయట పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు, బంధువులు అతన్ని కరీంనగర్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి తండ్రి కొన్నేళ్ల క్రితమే చనిపోగా, తల్లి లక్ష్మికి చేదోడు వాదోడుగా ఉంటున్నాడు. పెద్ద కుమారుడు ఉపాధి కోసం ఇతర దేశాలకు వెళ్లాడు. తల్లి లక్ష్మీ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కన్నుల పండువగా వేంకటేశ్వరుడి రథోత్సవం


లింగన్నపేటలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం

గంభీరావుపేట, అక్టోబరు 18 (ఆంధ్ర జ్యోతి) : గంభీరావుపేట మండ లం లింగన్నపేటలో వేంకటేశ్వరస్వామి రథోత్సవం కన్నుల పండువగా సాగింది. స్వామివారి బ్రహోత్సవాల్లో బాగంగా శుక్రవారం రథోత్సవం చేపట్టారు. గ్రామాభివృద్ధి, ఆలయ కమిటీల ఆధ్వ ర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరు రవీందర్ రావు, జిల్లా గ్రంథాలయ చైర్మన్ నాగుల సత్యనారాయణ, మార్కెట్ కమిటీ చైర్మన్ కొమిరిశెట్టి విజయతిరుపతి తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కేదెట్ల..?

- మెట్లదారిలో అడ్డంగా పడిన చెట్టు
- నడిచి వెళ్లే భక్తులకు ఇబ్బందులు


మెట్లదారిలో అడ్డంగా పడిన చెట్టు

మల్యాల, అక్టోబరు 18: కొండగట్టు ఆంజనేయస్వామిని దర్శించుకోవడానికి కొండపైకి నడిచి వెళ్లే మెట్లమార్గంలో చెట్టు అడ్డంగా పడిపోయింది. దీంతో ఈ మార్గంలో కొండ ఎక్కే భక్తులు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ చెట్టు నెల రోజుల క్రితం పడిపోయినట్లు తెలుస్తుండగా దాన్ని తొలగించడం లేదు. దీనికి తోడు మెట్లమార్గానికి ఇరువైపుల పిచ్చిమొక్కలు దట్టంగా పెరిగి భక్తులు నడవడానికి అవరోధంగా మారింది. అయినా దేవస్థానం అధికారులు పట్టించుకోకపోవడం పట్ల భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు

నిరుద్యోగ యువతకు అండగా


శిక్షణ పొందుతున్న యువకులతో పీడీ

యువకులకు శిక్షణ ఇస్తున్న గంగసాగర్

ఆదర్శం

- ఆర్మీలో చేరాలనుకునే వారికి ఉచిత శిక్షణ
- అభ్యర్థులను తీర్చిదిద్దుతున్న వ్యాయామ ఉపాధ్యాయుడు
- ఇప్పటి వరకు 45 మందికి ఉద్యోగం

ఆర్మీ ఉద్యోగం సాధించాలనేది ఆయన కల. అందుకు తగ్గట్టుగానే కొన్నేళ్లు కష్టపడ్డాడు. ఎలాగైనా కొలువు సాధించాలని సాధన చేశాడు. కాని ఆయన కల మాత్రం నెరవేరలేదు. చెవి దగ్గర ఉన్న చిన్న లోపంతో ఆయన ఆర్మీ ఉద్యోగానికి దూరం అయ్యాడు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. ఎంతో ఇష్టమైన ఆర్మీ ఉద్యోగం తనకు దక్కకున్నా ఆసక్తి ఉన్న వారు సాధించేలా సహాయ పడాలనుకున్నాడు. కానిస్టేబుల్, ఆర్మీ ఉద్యోగాలు అంటే ఇష్టమున్న యువతకు ఉచిత శిక్షణ ఇస్తూ వారు ఉద్యోగం సాధించేలా కృషి చేస్తున్నాడు.

మల్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల జిల్లా మల్యాల మండలం తక్కళ్లపల్లికి చెందిన కల్వకోట గంగసాగర్ అనే యువకుడు ఆర్మీ ఉద్యోగం సాధించాలని అనుకున్నాడు. అనుకోని పరిస్థితుల్లో ప్రభుత్వ వ్యాయామ ఉపాధ్యాయుడిగా స్థిరపడ్డాడు. అయితే ఆర్మీ ఉద్యోగం తనకు దక్కకపోయినా ఆ ఉద్యోగంలో యువతను చేర్పించాలనే ఆయన ఆశయంగా పెట్టుకున్నాడు. ఇందులో భాగంగా 2016 నుంచి నిరుద్యోగ యువతకు కానిస్టేబుల్, పారామిలటరీ బలగాలతోపాటు ఇటీవలి అగ్నివీర్‌కు ఉచిత శిక్షణ అందిస్తున్నాడు. ఇప్పటి వరకు ఆయన శిక్షణ అందించిన వారిలో 35మంది కానిస్టేబుల్స్ 10 మంది ఆర్మీలో ఉద్యోగం సాధించారు. 2020లో వచ్చిన కానిస్టేబుల్ నోటిఫికేషన్ సందర్భంగా గంగసాగర్ 85 మందికి ఉచితంగా శిక్షణ ఇచ్చాడు. వారిలో 20 మంది ఉద్యోగం సాధించారు. 2018లో 55మంది శిక్షణ ఇస్తే అందులో 15మంది ఉద్యోగాలు పొందారు.

- ఉద్యోగం.. శిక్షణ

గంగసాగర్ వ్యాయామ ఉపాధ్యాయుడుగా తన సొంతూరులోని జడ్పీ ఉన్నతపాఠశాలలో ఉద్యోగం చేశాడు. అదే పాఠశాల మైదానంలో యువతకు శిక్షణ ప్రారంభించాడు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు శారీరక శిక్షణ ఇస్తూ తరువాత పాఠశాలకు వెళ్లడం ఆయన దినచర్య. ప్రస్తుతం తాటిపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో



పీడీగా విధులు నిర్వహిస్తున్నాడు. గంగసాగర్ ఆసక్తి ఉన్న విద్యార్థులను రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేలా నిత్యం శిక్షణ అందిస్తున్నాడు. గంగాసాగర్ వద్ద శిక్షణకు మల్యాల, పెగడపల్లి, గొల్లపల్లి తదితర మండలాల నుంచి యువకులు వస్తుంటారు. ప్రస్తుతం పారామిలటరీ, అగ్నివీర్‌కు 15మంది శిక్షణ పొందుతున్నారు. ఈ శిక్షణతో పాటు కెరీర్‌గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తున్నాడు గంగసాగర్.

- మెడికల్ ఫెయిల్‌తో..

గంగసాగర్‌కు చిన్నప్పటి నుంచి ఆర్మీలో ఉద్యోగం సాధించి దేశసేవ సేవ చేయాలని కలలు కనేవాడు. అందులో భాగంగానే శిక్షణ పొందాడు. చెవి సంబంధిత చిన్న పాటి లోపంతో ఆర్మీ ఉద్యోగం సాధించలేక పోయాడు. దీంతో తాను సాధించకున్నా అదే ఉద్యోగం కొంత మంది యువతకైనా దక్కేలా చేయాలని అనుకున్నాడు. వెంటనే ఉచిత శిక్షణ ప్రారంభించాడు.

- ఉచితంగా శిక్షణ ఇస్తా..



ప్రజలకు సేవలందించే పోలీస్, ఆర్మీలో చేరాలనే యువతకు ఉచితంగా శిక్షణ అందిస్తున్నా. ఆసక్తి ఉన్న యువకులు ఎవరైనా నన్ను సంప్రదించవచ్చు. శారీరక శిక్షణ ఇచ్చి, కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పిస్తా. నేను ఆర్మీలో చేరాలని అనుకున్న.. సాధ్యం కాలేదు. నాలా ఆసక్తి ఉన్న కొంతమందైనా ఆర్మీలోకి వెళ్లాలనే ఆలోచనతో శిక్షణ ఇవ్వడం ప్రారంభించా.

- కల్వకోట గంగసాగర్

హుజూరాబాద్‌ఏరియా ఆస్పత్రి తనిఖీ

హుజూరాబాద్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చందు శుక్రవారం తనిఖీ చేశారు. గురువారం రాత్రి ఏరియా ఆస్పత్రిలోని బాత్రూంలో లభించిన నవజాత శిశువు మృతదేహంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో సుధాకర్‌రావు, విధులు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది, సెక్యూరిటీ, శానిటైజేషన్ సిబ్బందిని విచారించారు. ఆస్పత్రి సీసీ ఫుటేజీలను పోలీసులకు అందజేశారు. దర్యాప్తు చేసి దోషులను గుర్తించి చర్యలు తీసుకో వాలని ఫిర్యాదు చేశారు. అనంతరం డీసీహెచ్‌ఎస్ డాక్టర్ చందు మాట్లాడుతూ హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిలో అన్ని రకాల ఆపరేషన్లు నిర్వహిస్తున్నా మన్నారు. ప్రజలను భయభ్రాంతులను చేయడానికే కొంత మంది ఇలాంటివి చేస్తున్నారని చెప్పారు. ఈ శిశువు మృతదేహం ఆస్పత్రి బయట నుంచి వచ్చిందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయన్నారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


వైద్య సిబ్బందిని విచారిస్తున్న డీసీహెచ్‌ఎస్ చందు

తహసీల్దార్ కార్యాలయం ఎదుట పురుగుల మందు డబ్బాలతో ఆందోళన

- తన పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేస్తున్నారని ఆరోపణ
- తహసీల్దార్ హామీతో ఆందోళన విరమించిన రైతు

గొల్లపల్లి, అక్టోబరు 18: తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ ఏర్పాటు యత్నాలను నిరసిస్తూ జగిత్యాల జిల్లా గొల్లపల్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఓ రైతు తన కుటుంబ సభ్యులతో కలిసి పురుగుల మందు డబ్బాలతో శుక్రవారం ఆందోళన చేపట్టాడు. బాధితుడు మండలంలోని బీబీరాజ్ పల్లె గ్రామానికి చెందిన రైతు నరేష్ మాట్లాడుతూ తన పట్టా భూమిలో నుంచి అక్రమంగా తోవ తీయడానికి గ్రామానికి చెందిన కొందరు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించాడు. కాలువ పరిసరాల్లో చాలా మంది రైతుల పట్టా భూములు ఉన్నాయని, వారెవ్వరి భూములను సర్వే చేయకుండా తనవే సర్వే చేయడంతో గతంలో పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకుండా మళ్లీ సర్వే చేసేందుకు వచ్చారని పేర్కొన్నాడు.

దీంతో మనస్తాపం చెంది ఆందోళనకు దిగినట్లు బాధిత రైతు వాపోయాడు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వరదన్ బాధిత రైతు వద్దకు వచ్చి మాట్లాడారు. పట్టా భూమిలో నుంచి ఎలాంటి తోవ ఏర్పాటు చేయడం లేదని, భయాందోళన చెందాల్సిన అవసరం లేదని పేర్కొనడంతో బాధితులు ఆందోళనను విరమించారు. ల్యాండ్ ఆక్విజేషన్‌లో భాగంగా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు సర్వే చేశామని, అంతే తప్ప పట్టా భూమిలో నుంచి తోవ ఏర్పాటు చేసే అధికారం తనకు లేదని పేర్కొన్నారు. తాను మండలంలో నూతనంగా బాధ్యతలు చేపట్టానని, దీని పై పూర్తి స్థాయిలో పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

వేర్వేరు చోట్ల చోరీ

ధర్మారం (పెద్దపల్లి రూరల్), అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల చోరీలు జరిగాయి. ధర్మారం మండల కేంద్రానికి చెందిన చింతల రాజు అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు చింతల రాజు తెలిపిన వివరాల ప్రకారం.. గురువారం రాత్రి తన కుటుంబ సభ్యులతో కేశవపట్నం మండలం రాజాపూర్ గ్రామంలో తన బంధువుల ఇంటిలో నిర్వహించిన శుభాకార్యానికి వెళ్లిన సమయంలో ధర్మారం మండల కేంద్రంలోని తాళం వేసిన తన ఇంటిలో తలుపులను గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేసినట్లు తెలిపారు. ఉదయం తన డ్రైవర్ రాజు ఫోన్ ద్వారా సమాచారం అందించడంతో ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయని తెలుపగా కుటుంబ సభ్యులతో సహా ధర్మారం వచ్చి చూసేసరికి తలుపులు పగులగొట్టి, బీరువా తెరిచి ఉందని అందులో 38 గ్రాముల బంగారం, 30 వేల నగదు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ధర్మారం ఎస్ఐ లక్ష్మణ్ తెలిపారు.

గంభీరావుపేట: గంభీరావుపేట మండలం ముస్తాఫనగర్‌లో నారాయణరావు అనే వ్యక్తి ఇంట్లో గురువారం రాత్రి చోరీ జరిగింది. దొంగలు ఇంటి తాళాలు పగుల గొట్టి తులంన్నర బంగారు చైను. అర తులం చొప్పున ఉన్న రెండు బంగారు ఉంగరాలు, రూ.8 వేల నగదును ఎత్తుకెళ్లారు. ఇంటి ముందు పెట్టిన కారును తీసుకెళ్లే ప్రయత్నం చేశారు. వీలుగాక కారును ధ్వంసం చేశారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగలు టార్గెట్ చేస్తున్నారు. ఇటీవల పలుచోట్ల దొంగతనాలు జరిగాయి. దొంగతనాలకు సంబంధించి పోలీస్‌లు ఒకరిని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వ్యక్తిపై కత్తితో దాడి

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అల్లమయ్య గుట్ట ప్రాంతానికి చెందిన నూనే రవి అనే వ్యక్తిని అదే కాలనీకి చెందిన విబూది కిష్టయ్య కత్తితో దాడి చేసినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... నూనే రవి ఇంటి సమీపంలోని కిష్టయ్య వద్ద కొన్ని రోజుల క్రితం మధ్యవర్తిగా ఉండి మరో వ్యక్తికి డబ్బులను ఇప్పించాడు. డబ్బులు తీసుకున్న వ్యక్తి డబ్బులు తిరిగి ఇవ్వకపోవడంతో మధ్యవర్తిగా ఉన్న రవిని డబ్బులు చెల్లించాలని కిష్టయ్య అడిగాడ . దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. కిష్టయ్య ఇంట్లోకి వెళ్లి కత్తి తెచ్చి రవిపై దాడికి పాల్పడ్డాడు. స్థానికులు గమనించి వారించడంతో కిష్టయ్య అక్కడి నుంచి వెళ్లిపోయాడు. స్థానికులు 100 నంబర్‌కు సమాచారం అందించి రవిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరు మద్యం మత్తులో ఘర్షణకు దిగినట్లు స్థానికులు తెలిపారు. రవి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బెల్ట్‌షాప్ వేలంపై కేసు

సిరిసిల్ల క్రైం, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని తంగళ్లపల్లి మండలంలోని రాళ్లపేటలో బెల్ట్‌షాప్ వేలం వేసిన మాజీ సర్పంచ్ బాలసాని పర్శరాం, బొద్దుల పర్శరాం, గౌర అంజయ్య, సోమ మల్లయ్యపై శుక్రవారం కేసు నమోదు చేశామని సిరిసిల్ల డీఎస్పీ చంద్రశేఖరరెడ్డి తెలిపారు. గ్రామంలో మద్యం విక్రయానికి అమ్మ డానికి పెద్దమనుషులు వేలం నిర్వహించగా జి.శ్రీకాంత్ అనే వ్యక్తిని షాప్ నడిపేందుకు రూ.66,500 డిమాండ్ చేశారని, రూ.33 వేలు తీసుకొని మిగతావి ఇవ్వాలని బెదిరించారని డీఎస్పీ తెలిపారు.


సీజనల్ తోటలు


రవీందర్ సాగుచేస్తున్న బంతితోట


పట్టుకుచ్చు తోట

- పూలు, కూరగాయల సాగుతో లాభాలు
- పండగల సమయంలో పూలకు గిరాకీ


మునగ తోటలో అంతర్ పంటగా బంతి తోట


పూత దశలో ఉన్న బంతి తోట

సైదాపూర్, అక్టోబరు 18: సీజన్‌ను బట్టి పూలు, కూరగాయల తోటల సాగు చేస్తూ కొందరు రైతులు లాభాలు ఆర్జిస్తున్నారు. ప్రతీసారీ వరి, పత్తి, మొక్క జొన్న పంటలు పండిస్తుండడంతో భూములలో భూసారం తగ్గి పంట దిగుబడి రాకపోవడం, చీడ పీడలు ఆశించడంతో చాలా మంది రైతులు నష్ట పోతున్నారు. దీంతో కొందరు రైతులు ప్రత్యామ్నాయ పంటలవైపు దృష్టి సారిస్తు న్నారు. సైదాపూర్ మండలం రాంచంద్రా పూర్ గ్రామానికి చెందిన రైతు ఎనుగుల రవీందర్ బంతిపూలు సాగు చేస్తూ అధిక దిగుబడులు సాధిస్తున్నాడు. రవీందర్ తన కున్న నాలుగు ఎకరాల భూమితో పాటు ఇంకో 10 ఎకరాలు కౌలుకు తీసుకున్నాడు. సీజన్లను బట్టి కూరగాయలు, పూలతోటల పెంపకానికి మొగ్గు చూపాడు. ఎనిమిది ఎక రాల్లో పూలు, కూరగాయలు సాగు చేస్తు న్నాడు. ఎకరానికి రెండు లక్షల వరకు ఆదా యం వస్తుందని రవీందర్ అంటున్నాడు. వ్యవసాయంతోపాటు రవీందర్ పాడి ఆవులు పోషిస్తూ అదనపు ఆదాయం పొందుతున్నాడు.

- మునగ తోటలో అంతర పంటలుగా..

ఎనిమిది ఎకరాల్లో మునగ తోట సాగు చేస్తున్నాడు. చెట్ల మధ్యలో ఖాళీగా ఉన్న భూమిలో అంతర పంటగా బంతి, పట్టు కుచ్చు పూల తోటలు సాగు చేశాడు. బతుకమ్మ పండగ మొదలు కొని ఉగాది వరకు పూలకు మంచి గిరాకీ ఉంటుంది. దసరా నుంచి ఉగాది వరకు మంచి రోజులు ఉండడంతో శుభకార్యాలు జరుగుతుంటాయి. ఈ సమయంలో పూలకు మంచి గిరాకీ ఉంటుంది.

- గిరాకీకి అనుగుణంగా కూరగాయల సాగు

ఏ కూరగాయలకు ఏ సీజన్‌లో గిరాకి ఉంటుందోనని గుర్తించి, ఆ సీజన్‌లో ఆ కూరగాయలు సాగు చేస్తుంటాడు. పండిన కూరగాయలు, పూలను హుజూరాబాద్, జమ్మికుంట, హుస్నాబాద్, కరీంనగర్, సిద్దిపేట మార్కెట్లకు తీసుకెళ్లి అమ్ముతుంటారు. తోట వద్దకు వచ్చిన వారికి తాజ పూలు, కురగాయలు కోసి అమ్ముతారు..

- మంచి లాభాలు వస్తున్నాయి

నేను ఎనిమిది సంవత్సరాలుగా కాలానికనుగునంగా సీజన్ బట్టి పూలు, కూరగాయల తోటలు సాగు చేస్తున్నాను.ఎకరాకు పెట్టుబడి పోను 1.5 లక్షల రూపాయల వరకు ఆదా యం వస్తుంది. కష్టపడి పని చేస్తే వాణిజ్య పంటలతో లాభాలు పొందవచ్చు.

- ఎనుగుల రవీందర్, రైతు, రాంచంద్రాపూర్


బంతి తోటలో ఎనుగుల రవీందర్

న్యూస్ బాక్స్

అవిష్కరణలపై ఎస్సారార్‌లో వర్క్‌షాప్

గణేశ్‌నగర్,అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): శ్రీ రాజరాజేశ్వర ప్రభుత్వ ఆర్ట్స్, సైన్స్ కళాశాలలో శుక్రవారం సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీం, పాలసీస్, ఐక్యూఏసీ సంయుక్త నిర్వహణలో కళాశాల అధ్యాపకులకు వర్ క్షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె రామకృష్ణ మాట్లాడుతూ మారుతున్న పోటీ ప్రపంచంలో ఇనిస్టిట్యూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ నిరంతరం మదింపు చేసుకుంటూ ముందుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ఈ వర్క్‌షాప్ కొరకు ఎస్ఆర్ఆర్ కళాశాలను ఎంచుకున్నందుకు కళాశాల విద్యా కమిషనర్ శ్రీ దేవసేనకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని క్రిస్ప్ కోఆర్డినేటర్ సురభి కాక్ నిర్వహించారు. ఇనిస్టూషనల్ డెవలప్‌మెంట్ ప్లాన్ సస్టైనబుల్ గోల్స్ విశ్లేషణ, విజన్ మిషన్, లక్ష్యాలపై ఉదాహరణలతో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ముందుగా ఫ్లగ్ పోస్ట్ టెరిటరీ అనే కార్యాచరణను ఆమె నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ హరజోత్ కౌర్ మాట్లాడుతూ ఐక్యూఏసి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరగడం చాలా సంతోషకరమని అన్నారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్స్ పి నితిన్, టి రాజయ్య, సీఓఈ డాక్టర్ శ్రీనివాస్, ఐక్యూఏసి సభ్యులు డాక్టర్ టి కరుణాకర్, డాక్టర్ రాజేశ్వరి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సోమనరసయ్య, డాక్టర్ రాజశ్రీ, ప్రేమ్చందర్, అన్ని విభాగాల హెచ్ఓడిలు, ఇతర అధ్యాపక అధ్యాపకేతర బృందం పాల్గొన్నారు.

కాటన్ వస్త్ర పరిశ్రమకు చేయూతనివ్వాలి

సిరిసిల్ల రూరల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల కాటన్ వస్త్ర పరిశ్రమతోపాటు వాటిపై ఆధారపడిన కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం చేయూతనివ్వాలని జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు వొల్లాల కిషోర్, ఎలిగేటి రాము డిమాండ్ చేశారు. సిరిసిల్ల పట్టణంలోని చేనేత జౌళి శాఖ కార్యాలయానికి కరీంనగర్ జిల్లా సైజింగ్ వర్కర్స్ యూనియన్ సిరిసిల్ల శాఖ ఆధ్వర్యంలో కాటన్ కార్మికులు తరలివచ్చి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిరిసిల్ల చేనేత వస్త్ర పరిశ్రమ రెండో భీవండిగా పేరుగాంచిందన్నారు. గతంలో సిరిసిల్లలో వేలాది మర మగ్గాలు ఉండేవని, వాటికి అనుబంధంగా 30 సైజింగ్ పరిశ్రమలతోపాటు క్లాత్ డైయింగ్, పెట్టి కోట్స్, హమాలీ, ట్రాన్స్ పోర్ట్‌ల ద్వారా వేలాది మంది జీవనోపాధి పొందారని అన్నారు. గత ప్రభుత్వం కాటన్ వస్త్ర పరిశ్రమలకు మొండి చేయి చూపిందని, పాలి స్టర్ బతుకమ్మ చీరల ను తయారు చేయించడంతో కాటన్ వస్త్ర పరిశ్రమ కుంటు పడిపోయిందని అన్నారు. కార్మికులకు జీవనోపాధి లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వం ప్రకటించిన చీరలను కాటన్‌తో తయారు చేయించాలని కోరారు.

బతుకుపై భరోసానిస్తూ..



కరీంనగర్ జిల్లా జైలు

ఒకప్పుడు జైళ్లు అంటే కఠిన శిక్షలకు మారు పేరు.. ప్రస్తుతం పరిస్థితులు మారాయి. ప్రభుత్వాలు పలు సంస్కరణలను అమలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా శిక్షను అనుభవిస్తున్న ఖైదీలకు వివిధ పనుల్లో శిక్షణను అందిస్తున్నారు. కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసి ఉపాధి కల్పిస్తున్నారు. ఇందులో శిక్షను అనుభవిస్తున్న వారితోపాటు విడుదలైన వారూ పని చేస్తున్నారు. జైలులో పలువురు ఫర్నీచర్, ఇతర వస్తువులు తయారు చేస్తున్నారు. దీని ద్వారా ఖైదీలు ఉపాధి పొంది కొంత మొత్తాన్ని ఇంటికి పంపించుకుంటున్నారు. జైలు నుంచి విడుదలైన తర్వాత తాము నేర్చుకున్న పనులు చేసుకుంటూ సమాజంలో గౌరవంగా బతుకుతున్నారు.

- సంస్కరణలకు కేంద్రంగా కరీంనగర్ జిల్లా జైలు
- ఖైదీలకు వివిధ అంశాల్లో శిక్షణ
- పెట్రోల్ బంక్‌ల ఏర్పాటుతో ఉపాధి
- జైలు నుంచి విడుదలైన తర్వాత గౌరవంగా బతికేలా చర్యలు


బంకులో పని చేస్తున్న ఖైదీలు

కరీంనగర్ క్రైం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నేర సంఘటనల్లో జైలుకు వెళ్లిన ఖైదీలపై సమాజంలో కొంత చెడు అభిప్రాయం ఉండడం సహజం. శిక్షణ అనుభవించి బయటకు వచ్చిన తర్వాత తమ పద్ధతి, వ్యవహారశైలిని మార్చుకుని మంచి వ్యక్తులుగా జీవించాలని భావించినా సమాజంలో వారిని నేరస్థులుగానే పరిగణిస్తున్నారు. దీంతో వారికి ఎక్కడా సరైన ఉపాధి లభించడం లేదు. ఇటువంటి పరివర్తన చెందిన ఖైదీల కోసం జైళ్లశాఖ ఉపాధి కల్పనకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణనిస్తోంది. శిక్ష కాలంలో సత్ప్రవర్తన కలిగిన ఖైదీలకు ఉపాధి కల్పిస్తూ జైలు నుంచి విడుదల అయిన తరువాత వారు మళ్లీ నేరాలకు పాల్పడకుండా జీవనోపాధి మార్గాలను చూపుతున్నది. ఖైదీల నడవడికలో మార్పును తీసుకువచ్చి సమాజంలో పౌరులుగా గౌరవంగా బతికేలా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో జైళ్ల శాఖ ముందుకు సాగుతున్నది.

● వివిధ పనుల్లో శిక్షణ

కరీంనగర్ జిల్లా జైలులో పలు సంస్కరణలు తీసుకువచ్చారు. మొదట ఖైదీలకు వరంగల్ సెంట్రల్ జైలు, కరీంనగర్ జైలులో వివిధ పనుల్లో శిక్షణ ఇప్పిస్తున్నారు. ఆ తరువాత శిక్షణ పొందిన ఖైదీలతో ఫర్నిచర్, ఫినాయిల్ తయారీని చేపట్టారు. జైలు ఆవరణలో ఐఓసీఎల్ సంస్థ సహకారంతో మై నేషన్ పేరుతో పెట్రోల్‌బంక్‌ను నెలకొల్పారు. ఈ పెట్రోల్‌బంక్‌లో ప్రస్తుతం ఐదుగురు రిమాండ్ ఖైదీలతోపాటు జైలు నుంచి విడుదలైన మరో 20 మందికి ఉపాధిని కల్పిస్తున్నారు. వీరిలో రిమాండ్ ఖైదీలకు రోజుకు 225, శిక్ష అనుభవించి విడుదలైన వారికి రోజుకు 550 రూపాయల చొప్పున వేతనాలు చెల్లిస్తున్నారు.

● పెట్రోల్ బంక్ విస్తరణ

కరీంనగర్ జిల్లా జైలు ఆవరణలో 2017 జూన్ 17న ఐఓసీఎల్ పెట్రోల్‌బంక్‌ను ప్రారంభించారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసీఎల్) సంస్థ మొదట మూడు యంత్రాలతో 12 నాజిల్స్ ఏర్పాటు చేసింది. గిరాకీ పెరగడంతో ఆరు యంత్రాలు, 24 నాజిల్స్‌కు విస్తరించింది. జైలుకు చెందిన 1,200 చదరపు గజాల విస్తీర్ణంలో బంక్ నిర్మాణానికి ఒప్పందం చేసుకుని ఈ స్థలాన్ని 20 ఏళ్లపాటు ఐఓసీఎల్ సంస్థ లీజుకు తీసుకున్నది. ఈ పెట్రోల్‌బంక్‌లో రోజుకు 18 లక్షల నుంచి 20 లక్షల వ్యాపారం జరుగుతున్నది. రోజుకు ఎనిమిది వేల నుంచి 10 వేల లీటర్ల పెట్రోల్, ఆరు వేల నుంచి 8 వేల లీటర్ల డీజిల్ అమ్మకాలు జరుగుతున్నాయి. పెట్రోల్ అమ్మకాలపై లీటరుకు రెండు రూపాయలు కమిషన్‌గా ఆదాయం సమకూరుతున్నది. జిల్లా జైలు రెండున్నర ఎకరాల స్థలంలో ఉంది. ఇందులో జైలు బ్యారక్, ఇతర కార్యాలయాలు, జైలు అధికారులు, సిబ్బంది క్వార్టర్స్ ఉన్నాయి. జైలు ఆవరణలోని పెట్రోల్‌బంక్ లాభసాటిగా నడుస్తుండడంతో కరీంనగర్ శివారులో మరో పెట్రోల్ బంక్‌ను జైళ్లశాఖ లీజ్‌కు తీసుకుని నడిపిస్తున్నది. ఈ పెట్రోల్‌బంక్‌లో రోజుకు నాలుగు లక్షల నుంచి ఐదు లక్షల రూపాయల వ్యాపారం సాగుతున్నది. ఇక్కడ ఎనిమిది మంది ఖైదీలు పనిచేస్తున్నారు. జైలు లోపల ఏర్పాటు చేసిన ఫర్నిచర్ తయారీ కేంద్రంలో మరో 30 మంది వరకు ఉపాధిని కల్పిస్తున్నారు.

● జైళ్ల శాఖ అవుట్‌లెట్...

కరీంనగర్ జైలు ఆవరణలో ఏర్పాటు చేసిన పెట్రోల్ బంక్‌ను ఆనుకుని ఒక అవుట్‌లెట్‌ను ఏర్పాటు చేసి ఇందులో కరీంనగర్, వరంగల్ సెంట్రల్ జైలు ఖైదీలు తయారు చేసిన వస్తువులను విక్రయిస్తున్నారు. వీటికి మంచి ఆదరణ లభిస్తున్నది. ఈ స్టాల్‌లో కూడా ఖైదీ ఉపాధి పొందుతున్నాడు. జైలు ఆవరణలో నర్సరీలో పెంచిన మొక్కలను, ఫినాయిల్‌ను కూడా ప్రత్యేకస్టాల్ ఏర్పాటుచేసి విక్రయిస్తున్నారు. జైల్ ఇండస్ట్రీలో తయారైన కుర్చీలు, టేబుళ్ళు ఇతర ఫర్నిచర్‌ను పాఠశాలలకు విక్రయిస్తున్నారు.

ఆరేళ్లుగా పెట్రోల్ బంక్‌లో పని చేస్తున్నాను : ఇర్ఫాన్, ఓపెన్‌జైలు ఖైదీ

నేను జైలులోనే ఉంటూ ఇక్కడి పెట్రోల్‌బంక్‌లో ఆరేళ్లుగా పని చేస్తున్నాను. సంపాదించిన డబ్బుల్లో కొంత ఇంటికి పంపిస్తున్నాను. ఓపెన్ జైలులో భాగంగా పెట్రోల్‌బంక్‌లో పనిచేయడం వల్ల నిత్యం ప్రజల్లో ఉండడంతో ప్రశాంతంగా ఉంది. సత్ప్రవర్తనతో ఉండడంతో ఆరు నెలలకు ఒకసారి నెల రోజులు పెరోల్‌పై ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులతో గడుపుతున్నాను.

ఉపాధి చూపించారు.. : రాజు

2015 నుంచి జైలు పెట్రోల్‌బంక్‌లో పని చేస్తున్నాను. ఏడు సంవత్సరాల క్రితం జైలు నుంచి విడుదల అయినప్పటి నుంచి పెట్రోల్‌బంక్‌లో పార్ట్ టైంగా పనిచేస్తూ మిగతా సమయంలో ఇంటి వద్ద వ్యవసాయం, ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాను. నెలకు 16 వేల రూపాయలు సంపాదిస్తున్నాను. నాకు ఉపాధిని కల్పించిన జైలు అధికారులకు కృతజ్ఞతలు.

● ఖైదీల్లో పరివర్తనపై దృష్టి సారించాం..



క్షణికావేశంలో చేసిన తప్పుకు జైలుకు వచ్చిన ఖైదీల్లో పరివర్తతీసుకువచ్చి, సత్ప్రవర్తన కలిగిన వ్యక్తిగా జైలు నుంచి బయటకు వెళ్లి సామాన్యజీవిత గడిపేలా చేయడమే ధ్యేయంగా జైలు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నాం. నేరస్థుడిలో మార్పు తీసుకువచ్చి సమాజంలో గౌరవంగా బతికేలా అతనికి ఉపాధి కల్పించటానికి ప్రయత్నిస్తున్నాం. ఖైదీలకు వివిధ వృత్తుల్లో శిక్షణను అందిస్తూ సొంతకాళ్లపై నిలబడేలా చర్యలు తీసుకుంటున్నాం. స్వచ్ఛతకు మారుపేరుగా మైనేషన్ బ్రాండ్‌తో పెట్రోల్ బంక్‌ను నిర్వహిస్తున్నాం. 24 గంటలపాటు సీసీ కెమరాల నిఘాలో ఈ పెట్రోల్ బంక్ నడుస్తుంది.

- కె శ్రీనివాస్, జైలు సూపరింటెండెంట్

పత్తి నాణ్యత బేష్

● సీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డావే


జిన్నింగ్ మిల్లులో పత్తిని పరిశీలిస్తున్న అర్జున్‌దావే

జమ్మికుంట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జమ్మికుంటలో పత్తి నాణ్యత బాగుందని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డా వే అన్నారు. జమ్మికుంట వ్యవసాయ మార్కెట్ పరిధిలో నోటిఫై చేసిన ఏడు జిన్నింగ్ మిల్లులను శుక్రవారం తెలంగాణ రాష్ట్ర జిన్నింగ్ మిల్లుల అసోసియేషన్ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డితో కలిసి తనిఖీ చేశారు. మిల్లుల్లోని యంత్రాలు, వాటి పనితీరును అడిగి తెలుసుకున్నారు. జిన్నింగ్ చేసేందుకు యంత్రాలు సిద్ధంగా ఉన్నాయో, లేదో పరిశీలించారు. పత్తి మార్కెట్ యార్డును సందర్శించారు. బహిరంగ వేలం పాట ద్వారా ట్రేడర్స్ ఏ విధంగా కొనుగోలు చేస్తున్నారో పర్యవేక్షించారు. రైతులు తీసుకువచ్చిన పత్తి నాణ్యతను పరిశీలించారు. అనంతరం మార్కెట్ కార్యాలయంలో ఉన్నతశ్రేణి కార్యదర్శి ఆర్ మల్లేశం, ఇతర అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో కలిసి సమావేశం అయ్యారు. జిన్నింగ్ సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీసీఐ జనరల్ మేనేజర్ మాట్లాడుతూ జమ్మికుంటలో పత్తి నాణ్యత చాల బాగుందన్నారు. కాని తేమశాతం 30పైకి పైగా వస్తుందన్నారు. రైతులు ఇంటి వద్దనే పత్తి ఆరబెట్టి తీసుకు వస్తే ప్రభుత్వ మద్దతు ధర లభిస్తుందన్నారు. నోటిఫై చేసిన మిల్లులన్ని తనిఖీలు చేశామని, జిన్నింగ్‌కు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. తేమశాతం 12లోపు వస్తే కొనుగోళ్లు చేపట్టేందుకు ఇప్పుడు కూడా సిద్ధంగా ఉన్నామన్నారు. ప్రభుత్వ మద్దతు ధర 7,521 రూపాయలు దాటి ప్రైవేట్ ట్రేడర్స్ కొనుగోళ్లు చేపడితే కమర్షియల్ పర్చస్ సైతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. వరంగల్ సీసీఐ పరిధిలోని కరీంనగర్, వరంగల్, ఖమ్మం ఉమ్మడి జిల్లాల్లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. రైతులు ధ్రువీకరణ పత్రాలు వెంట తెచ్చుకోవాలని సూచించారు. కాగా పట్టణంలోని సరిత కాటన్ జిన్నింగ్ మిల్లుకు ఓ రైతు తమ పత్తిని విక్రయానికి తెచ్చాడు. పత్తిని పరిశీలించే ముందు సీసీఐ వరంగల్ బ్రాంచ్ జనరల్ మేనేజర్ అర్జున్‌డావే తమ కాళ్లకు ఉన్న షూస్‌ను తొలగించి పత్తిని ముట్టుకు న్నారు. రైతు పండించిన పత్తిని సీసీఐ అధికారి అంత పవిత్రంగా బావించడంపై అక్కడున్న వారు అభినందిస్తూ చర్చించుకున్నారు.

'శాతవాహన' వీసీగా ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్


ఉమేశ్‌కుమార్

కరీంనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): శాతవాహన యూనివ ర్శిటీ ఉపకులపతి (వీసీ)గా ప్రొ ఫెసర్ డాక్టర్ యు. ఉమేశ్‌కుమార్ నియ మి తులయ్యారు. మహబూబ్‌నగర్ జిల్లా నారాయణ పేటకు చెందిన ఉమేశ్‌కుమార్ మహాత్మాగాంధీ విశ్వవిద్యాలయం వైస్ చాన్స్‌లర్‌గా, రిజిస్ట్రార్‌గా, శాతవాహన యూనివర్శిటీ రిజిస్ట్రార్‌గా పనిచేశారు. యుఎస్ఏలోని యూనివర్శిటీ ఆఫ్ వెర్మోంట్‌లో బయోకెమిస్ట్రీ విభాగంలో పోస్ట్ డాక్టోరల్ అసోసియేట్‌గా సేవలందించారు. 28 సంవత్సరాల బోధన, 20 సంవత్సరాల పరిశోధన అనుభవాన్ని కలిగిన ఉమేశ్ కుమార్ వివిధ జాతీయ, అంతర్జాతీ య పత్రికల్లో 36 కథనాలను ప్రచు రించారు. అతడు యూజీసీలో సైతం రెండు చిన్న పరిశోధన ప్రాజెక్టులను చేపట్టారు. ఆయన మార్గదర్శకత్వంలో తొమ్మిది మంది పరిశోధకులకు పీహెచ్‌డీ పొందగా, ఒకరు పీహెచ్‌డీ కోసం పనిచేస్తున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని సెంట్రల్ యూనివర్శిటీ ఈసీగా, హర్యానాలోని బివానీ చౌదరి బన్సీలాల్ విశ్వవిద్యాలయానికి గవర్నర్ నామినీగా నియమితు లయ్యారు. పాలమూరు యూనివర్శిటీలో డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్స్‌గా ఉమేశ్‌కుమార్ పనిచేశారు. అత్యుత్తమ విద్యా సహకారాలకు వివిధ విద్యావేత్తల నుంచి అవార్డులను అందుకున్నారు. అతను ఎంచుకున్న రంగంలో అకడమిక్ ఎక్సలెన్స్‌గా గుర్తింపుతో అవార్డులను స్వీకరించారు. సీనియర్ రీసెర్చ్ ఫెలోషిప్, ఐఎస్ఐఆర్ అందుకున్నారు. ఉస్మానియా యూనివర్శిటీలో వివిధ అడ్మినిస్ట్రేటివ్, అకడమిక్ పదవులను నిర్వహించారు. నవంబర్ 19, 2015న భారత రాష్ట్రపతి నుంచి ప్రతిష్టాత్మక ఇందిరాగాంధీ జాతీయ స్థాయి ఎన్ఎస్ఎస్ ట్రోఫీని కూడా అందుకున్నారు. వివిధ రంగాల్లో విశిష్ట అనుభవం కలిగిన ప్రొఫెసర్ యు.ఉమేశ్‌కుమార్‌ను శాతవాహన వీసీగా నియమించడం పట్ల పలువురు విద్యావేత్తలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా, ఆయన శనివారం వీసీగా బాధ్య తలు స్వీకరిస్తారని తెలిసింది.

గ్రానైట్ లారీని ఢీకొన్న మినీ వ్యాన్

● ఇద్దరికి గాయాలు


ప్రమాదంలో నుజ్జునుజ్జయిన మినీ వ్యాన్

తిమ్మాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆగివున్న గ్రానైట్ లారీని మినీ వ్యాన్ ఢీకొన్న ఘటనలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ఎల్ఎండీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఓ గ్రానైట్ లారీ మండలంలోని ఎల్ఎండీ కాలనీ మహిళా శిశు కేంద్రం సమీపంలో రాజీవ్ రహదారిపై శుక్రవారం రాత్రి నిలిచిపోయింది. వరంగల్ వైపు నుంచి సిద్దిపేట వైపు వెళుతున్న మినీ వ్యాన్ ఆగివున్న గ్రానైట్ లారీను అతి వేగంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో మినీ వ్యాన్‌లో ఉన్న సిద్దిపేట జిల్లా గౌరెల్లి మండల్ కొండాపూర్ గ్రామానికి చెందిన భూక్యరాజు, సిద్దిపేట జిల్లా దూల్మిట్ట మండలం కొతిగల్ గ్రామానికి చెందిన ఎల్ వాగ్య వాహనంలోనే ఇరుక్కుపోయారు. అటుగా వెళుతున్న వాహనదారులు ఆగి వాహనం లో ఇరుక్కుపోయిన ఇద్దరినీ బయటకు తీసి అంబులెన్స్‌లో కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. సంఘటన స్థలానికి ఎల్ఎండీ బ్లూ కోల్ట్స్ పోలీసులు సురేష్, మల్లికార్జున్ చేరుకొని ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి సీఎం గ్రీన్ సిగ్నల్

కోల్‌సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. ఆయన ఆదేశాల మేరకు ప్రభుత్వం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సంబంధించి లాంచన ప్రక్రియను పూర్తి చేసింది. ఇప్పటికే కలెక్టర్ నుంచి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సంబంధించి ప్రతిపాదనలు ప్రభుత్వానికి వెళ్లాయి. రామగుండం నగరపాలక సంస్థతో పాటు పెద్దపల్లి, మంథని నియోజకవర్గాల పరిధిలోని పెద్దపల్లి, మంథని మున్సిపాలిటీలు, రామగిరి, కమాన్‌పూర్, పెద్దపల్లి, అంతర్గాం, పాలకుర్తి మండలాలు అర్బన్ డెవలప్‌మెంట్ పరిధిలోకి వస్తున్నాయి. ధర్మపురి నియోజకవర్గ పరిధిలోని ధర్మారాన్ని కూడా దీని పరిధిలోకి చేర్చారు. వెల్గటూరు మండల పరిధిలోని కొన్ని గ్రామాలు విలీనం కానున్నాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాల్లో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. రామగుండంతో పాటు మరో రెండు మూడు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల ఏర్పాటుకు కూడా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. మంత్రి శ్రీధర్‌బాబు, పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు సైతం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు సుముఖత వ్యక్తం చేశారు. రామగుండం శాసన సభ్యుడు రాజ్‌ఠాకూర్ రుడా ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వం వద్ద ప్రతిపాదన పెట్టడమే కాకుండా పట్టుబడుతున్నారు. మంత్రి శ్రీధర్‌బాబు దీనికి సంబంధించి ప్రక్రియ ముందుకు సాగడంలో చొరవ చూపుతున్నారు. 2011 జనాభా లెక్కల ప్రకారం జిల్లాలో 7,59,332 జనాభా ఉంది. 2024లో ఈ జనాభా 15లక్షలు దాటుతుందని అంచనా వేస్తున్నారు. 7లక్షల జనాభాతో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు చేశారు. అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీకి ప్రాథమికంగా ఆమోదం తెలిపినట్టు తెలుస్తుంది. ఈనెల 23న జరిగే క్యాబినెట్ సమావేశంలో దీనికి సంబంధించి ఎజెండా పెట్టనున్నారు.

● నామకరణమే తరువాయి..

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఏర్పాటు ఖాయమైపోయింది. ఇక నామకరణమే మిగిలింది. సుదీర్ఘ కాలంగా రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ(రుడా) ఏర్పాటు చేయాలని జిల్లాలో డిమాండ్ ఉంది. రామగుండానికి చారిత్రక, పురాణాల నేపథ్యం ఉంది. రామయణ కాలంలో రాముడు ఇక్కడ నివసించాడనే నానుడింది. ఆ పేరునే రామునిగుండాలు ఉన్నాయి. ఈ గుండాల పేరు మీదునే ఈ నగరానికి రామగుండంగా పేరు వచ్చింది. జనగామలో పురాతన త్రిలింగ రాజరాజేశ్వరస్వామి దేవాలయం కూడా ఉంది. దేశంలోనే ఎన్‌టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, సింగరేణి పరిశ్రమలున్నాయి. ఈ నేపథ్యంలో రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీనే సముచితంగా ఉంటుందనే అభిప్రాయాలు ఉన్నాయి. కాగా జిల్లాలోని మూడు నియోజకవర్గాల పరిధిలో అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ విస్తరిస్తుండడంతో మరేదైనా పేరును ఖరారు చేస్తారా అనే చర్చ కూడా సాగుతోంది. కరీంనగర్‌లో శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ, వరంగల్‌లో కాకతీయ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వంటివి ఏర్పాటు చేశారు. ఇక జిల్లాలోని ముగ్గురు ఎమ్మెల్యేలు, యంత్రాంగం సూచించే పేరునే ఖరారు చేసే అవకాశం ఉంది.

23 నుంచి వెబ్ ఆప్షన్స్ ఇవ్వాలి

తిమ్మాపూర్, అక్టోబరు18 (ఆంధ్ర జ్యోతి): డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(డీఈ ఈసెట్)-2024 ఉత్తీర్ణులై సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయిన అభ్యర్థులు 23వ తేదీ నుంచి డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సరిఫికెట్ల పరిశీలనకు హాజరు కాని ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు చెందిన అభ్యర్థులు ఈ నెల 21న కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

పెండింగ్ బిల్లులు విడుదల చేయాలి


అంబేద్కర్ విగ్రహంకు వినతిపత్రం సమర్పిస్తున్న సర్పంచులు

సిరిసిల్ల టౌన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న సర్పంచుల బిల్లులను విడుదల చేసే వరకు పోరాటాలు కొనసాగిస్తామని తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కరుణాకర్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో అంబే ద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించారు. అనంతరం తాజా మాజీ సర్పంచుల జేఏసీ ఆధ్వర్యంలో అంబేద్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన శిబిరంలో రిలే నిరాహార దీక్షలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడారు. గ్రామాభివృద్ధిలో భాగంగా గత ప్రభుత్వం అనుమతులతో అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. వాటికి సంబంధించిన బిల్లులు రాక పలువురు సర్పంచులు ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను విడదల చేయకుండా గత ప్రభుత్వం మోసం చేసిందని ఆరోపించారు. ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు విడదల చేయడంలో చిన్నచూపు చూడడం సరికాదన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను వెంటనే విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం సర్పంచులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. బిల్లులు విడుదల చేసే వరకు జిల్లా కేంద్రంలో రిలే నిరాహార దీక్షలను కొనసాగిస్తామన్నారు. తాజా మాజీ సర్పంచుల జేఏసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దమ్మ అంజయ్య, ఉపాధ్యక్షురాలు గణప శివజ్యోతి, కార్యదర్శి కోల నర్సయ్య, ఏనుగుల కేశవరావు, నాయకులు గాండ్ల సుమతి, తాడెపు ఎల్లం, వెంకటనర్సింహారెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు.

నిర్వాసిత గ్రామాలపై ఎన్టీపీసీ నిర్లక్ష్యం

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు


గుంతలు పడిన రోడ్డు

అంతర్గాం, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అంతర్గాం మండల పరిధిలోని నిర్వాసిత గ్రామం కుందనపల్లిపై ఎన్‌టీపీసీ సంస్థ గత కొన్ని సంవత్సరాలుగా నిర్లక్ష్యం వహిస్తోంది. ఎన్‌టీపీసీ సంస్థ నిర్మాణ సమయంలో కుందనపల్లికి చెందిన రైతుల నుంచి వందలాది ఎకరాల భూములు సేకరించి యాష్‌పాండ్‌లు నిర్మించింది. దీంతో బూడిద కారణంగా కుందనపల్లి అనేక రకాలుగా ఇబ్బందులకు గురవుతున్నది. యాష్‌పాండ్‌ల కారణంగా గ్రామంలోని బావులోని నీరు కలుషితం కావడంతో పాటు వీచే గాలులతో బూడిద మొత్తం పైకి లేచి గ్రామాన్ని కమ్మేస్తోంది. బూడిద చెరువుల కారణంగా గ్రామస్థులు నిత్యం కాలుష్యం కోరల మధ్య జీవనం కొనసాగించాల్సిన పరిస్థితి నెలకొంది. ఎన్‌టీపీసీ నిర్మాణ సమయంలో గ్రామస్థులకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పిస్తామని ఇచ్చిన హామీ విస్మరించి ఎన్‌టీపీసీ యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తోందని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఎన్‌టీపీసీ యాజమాన్యం నిర్లక్ష్య వైఖరి విడనాడి బూడిద నివారణ చర్యలు చేపట్టి మౌలిక సదుపాయాల కల్పనలో కృషి చేయాలని కోరుతున్నారు.

● పూర్తిగా చెడిపోయిన రహదారులు..

ఎన్‌టీపీసీ నిర్వాసిత గ్రామం కుందనపల్లి పంచాయతీ పరిధిలోని మొగల్ పహాడ్, అక్బర్‌నగర్, బద్రిపల్లి గ్రామాల్లో గత కొన్ని సంవత్సరాలుగా రహదారులు నిర్మించకపోవడంతో ప్రస్తుతం ఆయా గ్రామాల్లోని రహదారులు పూర్తిగా చెడిపోయి ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా మారాయి. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి గ్రామాల్లో రహదారుల నిర్మాణం కోసం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

● సాగుకు నోచుకోని పంట పొలాలు..

మండల పరిధిలోని ఎన్టీపీసీ నిర్వాసిత గ్రామం కుందనపల్లిలో పంట పొలాలు గత కొన్ని సంవత్సరాలుగా సాగుకు నోచనోవడం లేదు. ఎన్‌టీపీసీ యాష్ పాండ్ బూడిద కారణంగా పంట పొలాల్లో తుంగ మొలిచి భూములు ప్రస్తుతం సాగుకు పనికి రాకుండా పోయాయి. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి పొలాల్లో మొలిచిన తుంగను తొలగించి పంట పొలాలు సాగుకు అనువైన పరిస్థితులని నెలకొల్పాలని కుందనపల్లి రైతులు కోరుతున్నారు.


పొలాల్లో మొలిచిన తుంగ

● మరమ్మతులకు నోచుకోని నీటి శుద్ధి కేంద్రం..

కుందనపల్లి పరిధిలో గల మొగల్‌పహాడ్ గ్రామంలోని మంచి నీటి శుద్ధి కేంద్రం గత సంవత్సరకాలంగా పనిచేయకపోవడంతో ప్రజలు తాగునీటికి ఇబ్బందులు పడుతున్నారు. ఎన్‌టీపీసీ సంస్థ సీఎస్ఆర్-సీడీలో భాగంగా నీటి శుద్ధి కేంద్రం ఏర్పాటు చేసినప్పటికీ గత సంవత్సర కాలంగా నీటి శుద్ధి కేంద్రం పనిచేయకపోవడంతో ప్రజలు దూర ప్రాంతాల నుంచి నీటిని తెచ్చుకునే పరిస్థితి నెలకొంది. ఎన్‌టీపీసీ యాజమాన్యం వెంటనే స్పందించి మంచి నీటి శుద్ధి కేంద్రం మరమ్మతులు చేపట్టి తాగు నీటి సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

భూములు సాగుకు నోచుకోవడం లేదు..



ఎన్‌టీపీసీ నిర్మాణ సమయంలో సేకరించిన భూములు పోను మిగి లిన కొద్దిపాటి భూముల్లో తుంగ మొలిచి సాగుకు నోచుకోవడం లేదు. ఎన్‌టీపీసీ యాజమాన్యం భూములు సాగుకు ఉపయోగ పడేలా చర్యలు చేపట్టాలి.

- మేకల బాపు, రైతు, కుందనపల్లి

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం

కథలాపూర్, అక్టోబరు 18 : మండలంలోని దూలూరు - తక్కళ్ళపల్లి గ్రామాల మధ్య ఉన్న కల్వర్టు, మోడల్ స్కూల్ రోడ్లకు రు. 2.15 కోట్లు మంజూరు చేసినందుకుగాను సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్ర పటాలకు కాంగ్రెస్ శ్రేణులు క్షీరాభిషేకం చేశారు. నిధుల మంజూరు వల్ల ఎన్నో ఏళ్ల సమస్యలు పరిష్కారం కానున్నాయన్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు కాయితి నాగరాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అజీం, జిల్లా కార్యదర్శి గోపిడి ధనుంజయ్ రెడ్డి, పూంద్ర నారాయణరెడ్డి, రవి, పులి హరిప్రసాద్, సంతోష్, సత్యనారాయణ, మల్లేశ్ ఉన్నారు.

నియామకాలు

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : అల్ ఇండియా తెలంగాణ రాష్ట్ర బీసీ, ఎసీ, ఎస్టీ మైనార్టీ సాంఘీక సంక్షేమ సంఘ జగిత్యాల జిల్లా అధ్యక్షురాలుగా కోరుట్ల పట్టణానికి చెందిన సీఎచ్ నాగ నిర్మల, మహిళ అధ్యక్షురాలుగా శ్రావణిలను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు కొత్త విజయ్ భాస్కర్ శుక్రవారం నియామక పత్రాలను అందించారు. నాగ నిర్మల, శ్రావణి మాట్లాడారు. తన నియామకానికి సహకారం అందించిన రాష్ట్ర అధ్యక్షుడు కొత్త విజయ్ భాస్కర్‌తో పాటు సంఘ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

కథలాపూర్, అక్టోబరు 18 : మండలంలోని భూషణరావుపేటలో శుక్రవారం కోరుట్ల వసుధ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. గ్రామపంచాయతీ ఆవరణలో ఏర్పాటు స్త్రీ వైద్య నిపుణులు తాటిపాముల సింధూ మహిళలకు రోగులను పరీక్షించారు. సుమారు 146 మంది మహిళలను పరీక్షించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బత్తిని శ్రీనివాస్‌గౌడ్, మాజీ సర్పంచ్ కూన సులోచన, మాజీ ఎంపీటీసీ కొండ అంజనేయులు ఉన్నారు.

కొండగట్టులో ఉచిత వైద్య శిబిరం

మల్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు అంజనేయస్వామి ఆలయ ఆవరణలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. కరీంనగర్‌లోని ఫార్చ్యున్ మెడికేర్ ఆసుపత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శిబిరంలో సుమారు 120మంది దేవస్థానం ఉద్యోగులు, కుటుంబ సభ్యులకు వైద్య పరీక్షలు చేశారు. ఈవో రామకృష్ణరావు, ఏఈవో అంజయ్య, వైద్యులు అబ్దుల్ రహమాన్, అర్షియ, ఆయోషా, గణేశ్ పాల్గొన్నారు.

జగిత్యాల టు శబరిమల

● 1400 కిలో మీటర్లు ..48 రోజులు ● 24వ మహా పాదయాత్రకు శ్రీకారం
● ఆసక్తి చూపుతున్న దీక్షా పరుల


జగిత్యాల నుంచి పాదయాత్రగా బయల్దేరుతున్న దీక్షా పరులు

జగిత్యాల క్రైం, అక్టోబరు 14: నలభై ఒక్క రోజుల పాటు అనేక కఠిన నియమాలు పాటిస్తూ అయ్యప్ప దీక్ష దీక్షా పరులు భక్తి శ్రద్ధలను చాటుకుంటున్నారు. దీక్షా ప రులు ఎవరికి తోచిన విధంగా వారు శబరిమల యాత్ర చేస్తారు. 23 ఏళ్లుగా పలువురు దీక్షాపరులు జగిత్యాల నుంచి శబరిమలకు 1,400 కిలో మీటర్లు పాదయాత్ర చేస్తూ తమ భక్తి భావాన్ని చాటుకుంటున్నారు. ఈ నేపథ్యంలో 24వ మహా పాదయాత్రకు కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో జగిత్యాల నుంచి శ్రీకారం చుట్టారు.

ఆసక్తి చూపుతున్న దీక్షా పరులు..

ఓం శ్రీ స్వామియే శరణం అయ్యప్పా అంటూ భక్తులు ప్రతియేటా జగిత్యాల నుంచి శబరిమలకు పాదయాత్ర చేపట్టేందుకు ఆసక్తి చూపుతున్నారు. జిల్లా కేంద్రంతో పాటు రాయికల్, మల్యాల, జగిత్యాల రూరల్ తదితర ప్రాంతాల నుంచి ఈ యేడు భక్తుల మహా పాదయాత్రకు జిల్లా కేంద్రంలోని అయ్యప్ప ఆలయం నుంచి ప్రారంభించారు. అయ్యప్ప ఆలయంలో దీక్షా పరులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నెత్తిన ఇరుముడి కట్టుకుని పాదయాత్ర చేపట్టగా పలువురు గురుస్వాములు యాత్రను ప్రారంభించారు.

48 రోజులు..90 గుడులు మీదుగా పాదయాత్ర..

కరీంనగర్ జిల్లా కేంద్రానికి చెందిన గురుస్వామి గడప నాగరాజు ఆధ్వర్యంలో సోమవారం జగిత్యాల నుంచి శ్రీకారం చుట్టిన మాహాపాద్ర యాత్ర 48 రోజులు పాటు నవంబరు 30 వరకు కొనసాగనుంది. ఈ యాత్ర కరీంనగర్, సిద్దపేట, హైదరాబాద్, కర్నూల్, అనంతపురం, తమిళనాడు, కేరళల మీదుగా అయ్యప్ప సన్నిదానం వరకు చేపట్టేలా దీక్షా పరులు రూట్ మ్యాప్ సిద్ధం చేసుకున్నారు. పగలు, రాత్రి వేళల్లో బిక్షతో పాటు నిద్రించేందుకు వివిధ ప్రాంతాల్లో ఉన్న 90 ఆలయాలను ఎంచుకున్నారు. 48 రోజులు పాటు వీరి యాత్ర 1,400 కిలో మీటర్లు కొనసాగనుంది.

పాదయాత్ర నిర్వహించడం నా అదృష్టం..

గడప నాగరాజు, గురుస్వామి



మహాపాద యాత్ర నిర్వహించడం నా అదృష్టంగా భావిస్తున్నాను. అయ్యప్ప స్వామి అనుగ్రహంతో 24వ మహా పాద యాత్రను చేపట్టాం. దీక్షతో పాటు మహా పాద యాత్రకు ఏటేటా దీక్షా పరులు ఆసక్తి చూపుతున్నారు. అయ్యప్ప స్వామి అండదండలతో పాదయాత్ర విజయవంతం కావాలని మా ఆకాంక్ష.

మొదటి సారి కాలినడక...

బండారి విజయ్, బీట్ బజార్, జగిత్యాల



అయ్యప్ప స్వామి మాలను 10వ సారి తీసుకున్నాను. మొదటి సారిగా మాహా పాద యాత్రను చేప్టటడం ఆనందంగా ఉంది. భక్తిశ్రద్ధలతో స్వామియే శరణం అయ్యప్పా అంటూ 48 రోజుల యాత్రను దిగ్విజయంగా పూర్తి చేయడమే నా లక్ష్యం..

రెండో సారి కాలినడకన వెళుతున్నా..

ఆది శేషు, బుక్కవాడ, జగిత్యాల



అయ్యప్ప స్వామి దయతో రెండవ సారి మహా పాదయాత్ర చేపడుతున్నాను. కాలి నడక యాత్రతో ఆరోగ్యానికి వ్యాయామంతో పాలు వివిధ గుడుల సందర్శనతో నాలో భక్తి భావం కూడా పెంచింది. 17 సార్లు అయ్యప్ప దీక్షను తీసుకున్నాను.

5వ పేజీ తరువాయి..

శాతవాహనుల రాజధాని కోటిలింగాల..

వెల్గటూర్ మండలంలోని కోటిలింగాల గ్రామం చరిత్రకు సజీవసాక్ష్యంగా నిలుస్తోంది జిల్లా కేంద్రానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో పెద్దవాగు, గోదావరి నది సంగమ స్థానంలో కోటిలింగాల ఉంది. గ్రామంలోని నది ఒడ్డున కోటి లింగాలు ఉన్నాయని ప్రజల విశ్వాసిస్తుంటారు. గ్రామంలో ఎక్కడ చూసిన లింగాలు, శిలా కళా ఖండాలు, ఖండికలు కన్పిస్తాయని స్థానికులు అంటున్నారు. గతంలో తవ్వకాల్లో శాతవాహనుల కాలం నాటి నాణాలు, స్మారక చిహ్నాలు బయల్పడ్డాయి. శాతవాహనుల కాలంలో సరకులు ఎగుమతులు, దిగుమతులకు ఇది ఓడ రేవుగా ఉండేదని కోట ఉత్తర భగాన గోదావరి నీటి వరకు గల ప్రాచీన కట్టడాల వల్ల తెలుస్తోందని చరిత్రకారులు అంటున్నారు.

దక్షిణ కాశీగా ధర్మపురి...

ధర్మపురిలో శ్రీలక్ష్మీ నరసింహ స్వామి ఆలయం ఉంది. ప్రపంచ పటంలో దక్షిణ కాశీగా శ్రీ లక్ష్మీనరసింహ స్వామికి చోటు దక్కింది. రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా గోదావరి తీరాన లక్ష్మీనరసింహ స్వామి ఆలయం ఉండటం, దక్షిణ దిశగా ప్రవహించే గోదావరి తీరంలో ఈ పుణ్యక్షేత్రం ఉండడం విశేషంగా చెప్పుకుంటారు. ధర్మపురికి వచ్చే ముందుగా గోదావరి పుణ్య స్నా నం ఆచరించి ఆ తర్వాత శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారిని దర్శించుకుం టుండడం అన వాయితీగా వస్తోందని స్థానికులు అంటున్నారు.

ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రంగా కొండగట్టు..

జిల్లాలోని మల్యాల మండలం ముత్యంపేట గ్రామ శివారులో కొండగట్టు గుట్టపైన అంజనేయస్వామి దేవస్థానం రాష్ట్రంలోనే ప్రసిద్ధి చెందింది. రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి భక్తులు వచ్చి దర్శనం చేసుకుంటుంటారు. తెలుగు రాష్ట్రాలతో పాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌ఘడ్ నుంచి భక్తులు వచ్చి దర్శించుకుంటారు. వీటికి తోడు రాయికల్ త్రికూట ఆలయం, మల్లాపూర్ శివారులోని కనక సోమేశ్వరుని గుట్ట పర్యాటక కేంద్రంగా మారుతోంది. అదే విధంగా పైడిమడుగు వద్దనున్న పెద్ద మర్రిచెట్టు, పెగడపల్లిలో ఆరవెల్లి దేవాలయం, జగిత్యాల మండలం పోలాస గ్రామ శివారులో అతిపురాత నమ్మైన పౌలస్తేశ్వర స్వామి ఆలయం, ఇబ్రహీంపట్నంలోని బండలింగాపూర్ గ్రామ శివారులలో హనుమాన్ దేవాలయాలు సైతం పర్యాటకానికి అనువుగా ఉంటున్నాయన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

యువ క్లబ్‌లతో పర్యాటకానికి ప్రాధాన్యం

సత్య ప్రసాద్, కలెక్టర్



యువ క్లబ్‌ల ఏర్పాటుతో పర్యాటక రంగానికి మరింత ప్రాధాన్యత దక్కేలా ప్రయత్నాలు చేస్తున్నాము. పర్యాటకం, సంస్కృతి సంప్రదాయాలు, వార సత్వ సంపదపై విద్యార్థులకు అవగాహన కల్పించడమే కాకుండా భవిష్యత్తులో పర్యాటకం వల్ల కలిగే లాభాలు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు, పర్యాటక అనుబంధ రంగాల అభివృద్ధి తదితర అంశాలపై చిన్నప్పటి నుంచే పెంచు కునే అవకాశం యువ క్లబ్బుల ద్వారా కల్పిస్తున్నాము.

యువకులు క్రీడల్లో రాణించాలి

మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వరరావు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): యువకులు క్రీడాలలో రాణించాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమామహేశ్వ ర రావు అన్నారు. ఈ నెల 21న పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని పురస్కరించుకోని శుక్రవారం పట్టణంలోని అంబేద్కర్ స్టేడియంలో వాలిబాల్ టోర్నమెంట్ నిర్వహించారు. సర్కిల్ పరిధిలోని 10 గ్రామాలకు చెందిన క్రీడాకారులు వాలీబాల్ టోర్నమెంట్‌లో పాల్గొన్నారు. డీఎస్పీ ఉమా మహేశ్వరరావు టోర్నమెంట్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి యేడు 21న పోలీస్ అమరవీరుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామన్నారు.

అందులో భాగంగా క్రీడాలతో పాటు వివిధ సేవ కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఆటలలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నాట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి, మెట్‌పల్లి ఎస్ఐ చిరంజీవి, ఇబ్రహీంపట్రం ఎస్ఐ అనిల్, మల్లాపూర్ ఎస్ఐ కిరణ్ కుమార్, క్రీడాకారులు, పాల్గొన్నారు.


క్రీడాకారులతో పోలీస్ బృందం

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక

ధర్మపురి, అక్టోబరు 18 : ధర్మపురి పట్టణంలోని 33బై కేవి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వినియోగదారుల సమర్పించిన 8 ధరఖాస్తుల్లో రెండు దరఖాస్తులను అధికారులు పరిష్కరించారు. జగిత్యాల జిల్లా సూపరిండెంట్ ఇంజనీర్ సాలియా, డివిజనల్ ఇంజనీర్ రాజిరెడ్డి, ఎస్ ఏవో తిరుపతి, ఏడీఈ సింధూర్ శర్మ పాల్గొన్నారు.

కుట్టుమిషన్ల పంపిణీ

మల్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తాటిపల్లిలో మహిళలకు ఫాతిమానగర్ అడోరేషన్ సొసైటి ఆధ్వర్యంలో కుట్టుమిషన్లు, పండ్ల మొక్కలు పంపిణి చేశారు. సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ సిస్టర్ ప్రీత, మాజీ ఎంపీపీ ఆనందరెడ్డి, ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ దీప్తి, నవ్య, వెలంగిని, మల్లేశం, నారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి సీసీ ప్రభాకర్, సీఏ రజని పాల్గొన్నారు.

ప్రతిమ ఫౌండేషన్ ఆరోగ్య సేవలపై అవగాహన

ధర్మపురి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి మండలంలోని దొంతాపూర్ గ్రామపంచాయతీ వద్ద ప్రతిమ ఫౌండేషన్ కల్పించే ఆరోగ్య సేవలు, మహిళా ఆరోగ్యంపై తీసుకునే పద్ధతుల గురించి శుక్రవారం అవగాహన కల్పించారు. జీఎంఆర్ ప్రతిమ ఎడ్యుకేషనల్ ఫౌండేషన్ ఉమ్మడి సహకారంతో నిరుద్యోగ యుతకు శిక్షణా కేంద్రాల ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రతిమ ఫౌండేషన్ మండల కోఆర్డినేటర్ అల్లె రాజేశం, నాయకులు ఎర్ర మోహన్, చిగిరి భూమారెడ్డి, తిరుపతి, రాజన్న, ఈజీఎస్ ఫీల్డు అసిస్టెంట్, మాజీ ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో జాతీయ బృందాల పర్యటన

-బతుకమ్మతో స్వాగతం పలికిన మహిళలు
-కేంద్ర ప్రభుత్వ పథకాల అమలు తీరుపై పరిశీలన

ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములకుర్తి, బర్తీపూర్ గ్రామాలో శుక్రవారం జాతీయ బృందం పర్యటించింది. నేషనల్ మానిటరింగ్ టీం సభ్యులు డాక్టర్ బి.సుబ్రహ్మణ్యంరెడ్డి, టిం సభ్యులు జయప్రకాష్, శ్రీనివాస్ గ్రామాలలో పర్యటించారు. మానిటరింగ్ టీం సభ్యులను మహిళ సంఘం సభ్యులు బతుకమ్మతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కేంద్రం ప్రభుత్వ పథకాల అమలు తీరును పరిశీలించారు. ఉపాధి హామి పథకంపై గ్రామస్తులకు వివరించారు. మహిళ సంఘ సభ్యులను కలిసి మహిళల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అడిగి తెలుసుకున్నారు. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు తీసుకుంటున్న లోన్‌ల వివరాలను పరిశీలించారు. గ్రామాలలో పర్యటించి పూర్తి వివరాలు సేకరించి కేంద్ర ప్రభుత్వం 12 రకాల పథకాలుకు సంబంధించిన నివేదికలను సేకరించారు. గ్రామలలో లబ్దిదారులను కలిసి వివరాలను సేకరించారు. పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డీఈ ఓడీవో మదన్ మోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఐసీడీఎస్ సూపర్ వైజర్ శోభరాణి, ఏపీఎం శంకర్, ప్రత్యేక అధికారి అరుణ, తదితరులు పాల్గొన్నారు.

దేవాలయాల్లో హుండీ లెక్కింపు

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అతి పురాతన దేవాలయమైన శ్రీ వేంకటేశ్వర దేవాలయంలో శుక్రవారం జగిత్యాల డివిజన్ దేవాలయ శాఖ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి పర్యవేక్షణలో ఈవో విక్రం ఆధ్వర్యంలో హుండీ లెక్కింపును నిర్వహించారు. హుండీ ఆదాయం రూ. 86,506 సమకూరినట్లు దేవాలయ ఈవో విక్రం తెలిపారు. ఈ కార్యక్రమంలో పురహితుడు నరసింహాచారీ, జూనియర్ అసిస్టెంట్ నర్సయ్య, సిబ్బంది గంగాధర్, రాజేందర్, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు, లక్ష్మి, ఇందిరా, భక్తులు ఎతిరాజం నర్సయ్య, ప్రసాద్‌లతో పాటు పలువురు పాల్గొన్నారు.

●పట్టణ శివారులోని సాయిబాబ ఆలయంలో దేవాలయ శాఖ జిల్లా పరివేక్షకుడు రాజమౌళి ఆధ్వర్యంలో భక్త సమాజం సభ్యుల పర్యవేక్షణలో హుండీ లెక్కింపు నిర్వహించారు. హుండీ ఆదాయం రూ. 2,26,886గా సమకూరినట్లు దేవలయ శాఖ అధికారులు తెలిపారు. ఎప్పడిలాగే మిశ్రమ బంగారంను హుండీలో ఉంచినట్లు దేవాలయ శాఖ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవాలయ పురహితులు రమేష్, కిరణ్‌లతో పాటు సాయిబాబ సేవా సభ్యులు పాల్గొన్నారు.


సాయిరాం ఆలయంలో హుండీ లెక్కిస్తున్న అధికారులు, భక్తులు

ఎన్‌పీడీసీఎల్ ఏఈగా దివాకర్‌రావు

కథలాపూర్, అక్టోబరు 18: మండల నార్తన్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ (ఎన్‌పీడీసీఎల్) అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా దివాకర్‌రావు నియమితులు కాగా శుక్రవారం విధుల్లో చేరారు. ఇక్కడ పనిచేసిన జమీల్ పాషా గోదావరిఖని వెస్ట్‌కు బదిలీపై వెళ్లారు. గొల్లపల్లిలో పనిచేసిన దివాకర్‌రావు ఇక్కడికి బదిలీపై వచ్చారు. అదేవిధంగా కథలాపూర్‌లో సబ్‌ఇంజనీర్‌గా పనిచేసిన జ్యోతి కోరుట్ల సబ్‌డివిజన్‌కు బదిలీపై వెళ్లగా ఇక్కడికి మెట్‌పల్లి రూరల్ నుంచి నవీన్ వచ్చారు.

గణిత ఫోరం రాష్ట్ర సలహాదారుడుగా రాంప్రసాద్



కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర గణిత ఫోరం సలహాదారుగా కోరుట్ల పట్టణానికి చెందిన చౌడారపు రాంప్రసాద్‌ను నియమిస్తూ ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు కందికొండ శ్రీనివాస్ నుంచి ఉత్తర్వులు శుక్రవారం జారీ అయ్యాయి. కోరుట్ల పట్టణానికి చెందిన రాంప్రసాద్ నిజామాబాదు జిల్లా కమ్మరిపల్లి మండలం కోనాపూర్ గ్రామంలో గణితం ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. గణిత ఫోరం రాష్ట్ర సలహాదారుడుగా ఎంపికయిన రాంప్రసాద్ మాట్లాడుతూ తన నియామకానికి సహకారం అందించిన ఉన్నత విద్యా అధికారులతో పాటు రాష్ట్ర ఫోరం సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రాంప్రసాద్‌ను కోరుట్ల, కథలాపూర్, మల్లాపూర్, ఇబ్రహీంపట్నం మండల విద్యాధికారులు గంగుల నరేశం, లోకిని శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, బండారి మధు, మాజీ జిల్లా సైన్స్ అధికారి బాజోజీ శ్రీనివాస్, ప్రధానో పాధ్యాయులు అనంద్‌రావు, మోటూరి రవీందర్, కోరుట్ల నోడల్ అధికారి మార్గం రాజేంద్రప్రసాద్, నల్ల శంకర్, కమ్మరిపల్లి మండల విద్యాధికారి ఆంధ్రయ్యలు సన్మానించారు.

తమ్ముణ్ని ఇండియాకు తెప్పించాలని.. ప్రవాసీ ప్రజావాణిలో అన్న వినతి..

కొడిమ్యాల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): కువైట్ దేశంలో బైక్ రైడర్‌గా ఉద్యోగానికి వెళ్లి తన తమ్ముడు అనారోగ్యానికి గురైనందున ఇండియాకు చేరుకునేలా తగు చర్యలు తీసుకోవాలని శుక్రవారం హైదరాబాదులోని ప్రవాసీ ప్రజావాణిలో బాధితుడి అన్న అనిల్ వినతి పత్రం అందించాడు. మండలంలోని డబుతిమ్మయ్యపల్లి గ్రామానికి చెందిన తన తమ్ముడు శ్రీరాముల అనుదీప్ ఫిట్స్, తలనొప్పి ఇతర అనారోగ్య కారణాలతో బాధపడుతున్నట్లు పేర్కొన్నాడు. ప్రవాసీ ప్రజావాణికి దరఖాస్తు రాయడంలో అనిల్‌కు మాజీ ఐఎఫ్ఎస్ అధికారి అంబాసిడర్ డా.. బీఎం వినోద్‌కుమార్, ఎమిగ్రంట్స్ ఫోరం అధ్యక్షుడు మంద భీంరెడ్డి సహకరించినట్లు తెలిపాడు. తన తమ్ముడు ఇండియాకు వచ్చే విధంగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, సీఎం రేవంత్‌రెడ్డి చొరవ తీసుకొని సహాయం చేయాలని అనిల్ కోరాడు.

ఘనంగా కొమురం భీం వర్ధంతి

రాయికల్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రాయికల్ పట్టణంలో ఆదివాసి జేఏసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రం రవీందర్ ఆధ్వర్యంలో శుక్రవారం కొమురం భీం వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా కొమురం భీం విగ్రహానికి రాయికల్ తహసీల్దార్ ఖయ్యూం, ఇతర నాయకులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఆయన పోరాట స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకుని సమాజ నిర్మాణానికి తోడ్పడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమోద్, నాగేందర్, అభిలాష్, సతీష్, వినోద్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరాఫరాలో అంతరాయం

జగిత్యాలరూరల్, అక్టోబరు 18: జగిత్యాల రూరల్ మండల పరిధిలోని కల్లెడ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా శనివారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు కల్లెడ సబ్‌స్టేషన్ పరిధిలోని కల్లెడ, అనంతారం, గుట్రాజ్‌పల్లి, తక్కళ్లపల్లి, హబ్సీపూర్, సోమన్‌పల్లి, గ్రామాల్లో విద్యుత్ సరాఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ సుందర్ తెలిపారు. అలాగే పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల దృష్ట్యా శనివారం మధ్యాహ్నం 3.30 గంటల నుంచి సాయంత్రం 5 వరకు పొరండ్ల సబ్‌స్టేషన్ పరిధిలోని పొరండ్ల, బాలపల్లి, కన్నాపూర్, కండ్లపల్లి, గ్రామాల్లో విద్యుత్ సరాఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు.

కథలాపూర్ మండలంలో..

కథలాపూర్, అక్టోబరు 18: ఈ నెల 19న కథలాపూర్ 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని సిరికొండ, పోసానిపేట, కథలాపూర్, దుంపెట, దూలూరు గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏఈఈ దివాకర్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. వార్షిక మరమ్మతుల దృష్ట్యా ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల దాకా విద్యుత్ అంత రాయం కలుతుందన్నారు. రైతులు, గృహ, వ్యాపార వినియో గదారులు సహకరించాలని కోరారు.


అధ్వానంగా ఉన్న మోడల్ స్కూల్ రోడ్డు

ఎట్టకేలకు మోడల్ స్కూల్ రోడ్డుకు మహర్దశ

● రు. 1.30 కోట్లు సీఆర్ఆర్ నిధులు మంజూరు

కథలాపూర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : ఏళ్ల నుంచి మోడల్ స్కూల్ విద్యార్థులు పడుతున్న కష్టాలు ఎట్టకేలకు తీరనున్నాయి. కొద్ది పాటి వర్షాలకే పూర్తిగా జలమయంగా మారి పాఠశాలకు రోజుల తరబడి సెలవులు ప్రకటించిన సందర్భాలు ఉన్నాయి.

మోకాలి లోతు వరకు నీళ్ల నుంచి విద్యార్థులు చదువుకునేందుకు విధి లేని పరిస్థితుల్లో వెళ్లాల్సి వచ్చేది. ఈ రోడ్డు వెంట ప్రభుత్వ జూనియర్ కళాశాల, కస్తూర్భాగాంధీ పాఠశాలకు ప్రతీ దినం వెయ్యి మం ది విద్యార్థులు కిలోమీటర్ దూరం చదు వుకేనేందుకు వెళ్తుంటారు. అయితే ఎన్నో ఏళ్ళుగా విద్యార్థులు పడుతున్న కష్టాల గురించి నేతలకు ఉపాధ్యాయులు, విద్యార్థి సంఘాలు, ప్రజాప్రతినిధులు విన్నవించినా ఫలి తం లేకుండా పోయింది. ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సిఫార్సు మేరకు బీటీ రోడ్డు వేయ డాని కిగాను సీఆర్ఆర్ గ్రాంటు కింద రూ. 1.30 కోట్లు పంచాయతీ రాజ్ శాఖ నిధులు కేటాయించింది. నిధుల మంజూరు పట్ల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్షం వెలిబుచ్చారు.

ఘనంగా కోరుట్ల ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కోరుట్ల, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి) : కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ జన్మదినం శుక్రవారం బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి ట్విటర్ ద్వారా సంజయ్‌కి అభినంద నలు తెలిపారు. హైదరాబాదులోని కేసీఆర్ ఇంట్లో కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కలువగా అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. పట్ట ణంలోని బీఆర్ఎస్ శ్రేణులు ప్రభుత్వ ప్రైవేట్ ఆసుపత్రిలలో రోగులను పండ్లు పంపిణీ చేసి వేడుకలను నిర్వహించారు. సర్పంచ్‌ల పోరం జిల్లా మాజీ అధ్యక్షుడు దారిశెట్టి రాజేష్, మార్కెట్ కమిటి మాజీ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి, పాల్గొన్నారు.

మెట్‌పల్లి టౌన్: పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు ఘనంగా నిర్వహించా రు. మున్సిపల్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కి శుభాకాంక్షలు తెలుపుతున్న కేసీఆర్

కథలాపూర్ : మండల కేంద్రంలో బీఆర్ఎస్ శ్రేణులు ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి పలువురికి పంపిణీ చేశారు. మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వర్ధినేని నాగేశ్వ ర్‌రావు, మాజీ ఎంపీటీసీ మామిడిపల్లి రవి, కల్లెడ శంకర్ ఉన్నారు.

మెట్‌పల్లి రూరల్: జగ్గసాగర్‌లో నాయకులు, వెల్లుల్ల గ్రామాల్లోని ప్రభుత్వం పాఠశాలలోని విద్యార్థులకు మాజీ ఎంపీపీ మారు సాయిరెడ్డి నోట్‌బుక్స్, పెన్నులు అందజేశారు. పుల్ల జగన్‌గౌడ్, వెంకటేష్, ముదాం అనిల్, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

మల్లాపూర్: కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ జన్మదిన వేడుకలు మల్లాపూర్, రాఘవపేట తదితర గ్రామాల్లో శుక్రవారం జరిపారు. నాయకులు తోట శ్రీనివాస్, బైరి రవికుమార్ యాదవ్, పాల్గొన్నారు.

టీకాలను సద్వినియోగం చేసుకోవాలి

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పశు వులలో వల్ల వచ్చే అంటువ్యాధి నివారణకు పశు వులకు గాలికుంటు టీకాలు వేయించాలని మెట్‌పల్లి మండల పశువైద్యాధికారి కొమ్మెర మనీషా పటేల్ కోరారు. శుక్రవారం పట్టణంలోని 11వ వార్డు వెంకట్రావ్ పేటలో పశువులకు గాలి కుంటు వ్యాధి టీకాలను వేసారు. పశువైద్య సిబ్బంది రమణయ్య, ఖాజా చిరంజన్, మోహన్ పాల్గొన్నారు.

మెట్‌పల్లి రూరల్, అక్టోబరు, 18 (ఆంధ్రజ్యోతి) : రైతులు మూగజీవాలకు వ్యాధులు సోకకుండా ముం దస్తుగా వ్యాధి నివారణ టీకాలను వేయించాలని మండల వైద్యాధికారి డాక్టర్ మనీషాపటేల్ సూచించారు. పశు సంవర్ధకశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని చౌలమద్ది, వెంకట్రావుపేట గ్రామాల్లోని బర్రెలు, ఎద్దులు, ఆవులకు ఉచితంగా గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేసి రైతులకు అవగాహన కల్పించారు. పశు వైద్యాధికారులు రమణయ్య, ఖాజా, చిరంజన్, మోహన్, సిబ్బంది పాల్గొన్నారు.

భవన నిర్మాణాన్ని ఆపాలని కమిషనర్‌కు ఫిర్యాదు

మెట్‌పల్లి టౌన్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వయంభ హనుమాన్ ఆలయం వద్ద అక్రమంగా అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణ పనులను ఆపాలని కోరుతూ 8,9,10,20వ వార్డులకు చెందిన కాలని వాసులు శుక్రవారం కమిషర్ మోహన్‌కు ఫిర్యాదు చేశారు. వినతి పత్రం అందించిన వారిలో పూజగిరి శ్రీనివాస్, సుధాకర్, శ్రీనివాస్, ప్రసాద్, శేఖర్, కృష్ణబాబు, తేజ, నరేష్ ఉన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన పీపీ

జగిత్యాల అర్బన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల పోక్సో కోర్టు స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా నియామకమైన చీటి రామకృష్ణా రావు ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్‌ను కలిశారు. శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన ఆయన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసారు.

●జగిత్యాల మున్సిపల్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన చిరంజీవి శుక్రవారం జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్‌ను కలిశారు. శుక్రవారం ఎమ్మెల్యే నివాసానికి వెళ్లిన ఆయన ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.